ప్రజాశక్తి
విశాఖ

శుక్రవారం
జనవరి 5,
2018


బాధితురాలిని పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ శివాజీ

నిందితులను కఠినంగా శిక్షిస్తాం

అత్యాచార బాధితురాలిని పరామర్శించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్

వార్త 12లో..



స్టీల్‌ప్లాంట్‌లో.. పెట్టుబడులు ఉపసంహా'రణం'

- ప్రభుత్వరంగ సంస్థల నిర్వీర్యానికి బిజెపి కుట్ర
- డిసిఐ వేటుకు వ్యతిరేకంగా నేడు ప్రజాబ్యాలెట్
- స్టీల్‌ప్లాంట్ రక్షణకూ తప్పని పోరాటం

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

డిసిఐని అమ్మేయాలని కేంద్రంలోని బిజెపి క్యాబినెట్ నిర్ణయానికి వ్యతిరేకంగా ఓ వైపు పోరాటం తీవ్రమవుతున్న తరుణంలో సిగ్గూఎగ్గూ లేకుండా కేంద్రం మరో పిడుగును విశాఖ కార్మికవర్గంపై పడేసింది. డిసిఐ తర్వాత స్టీల్‌ప్లాంట్ లక్ష్యంగా కేంద్రంలోని బిజెపి ప్రయాణిస్తోంది. దేశంలో సముద్ర తీరాన గల ఏకైక స్టీల్‌ప్లాంట్ ఆర్ఐఎన్ఎల్‌లో పెట్టుబడులను 10శాతం ఉపసంహరించాలని క్యాబినెట్ ఆమోదించినట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో స్టీల్‌ప్లాంట్‌లో లోపల మండే 'ఫర్నేస్'లు ఇక నుంచీ ప్లాంట్ బయటే ఉద్యోగుల ఆందోళన రూపంలో మండేందుకు రంగం సిద్ధమవుతోంది. స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించాలన్న ఆలోచన మోడీ ప్రభుత్వానికి ఉందన్న సంగతి తెలిసి, ఇప్పటికే ఉద్యోగ సంఘాలు తీవ్ర ఆందోళనతో ఉన్నాయి. 10శాతం వాటాలను ఉపసంహరణకు తెగబడుతుందన్న విషయంపై నిత్యం ఉద్యోగులు, కార్మికులు పెద్దఎత్తున భయపడుతూనే ఉన్నారు. అయితే డిసిఐ ఆందోళన జరుగుతున్న సమయంలో స్టీల్‌ప్లాంట్‌పై ఇలాంటి తెగింపు నిర్ణయం చేస్తుందా? అన్న అనుమానాలు కొంతమందిలో ఉన్న మాట వాస్తవం. కానీ ఒకదాని తర్వాత ఒకటి అనే పద్ధతి గాకుండా దెబ్బమీద దెబ్బకొట్టే పద్ధతిని బిజెపి అనుసరిస్తుందన్న అంచనా వామపక్షాలు వ్యక్తం చేస్తూనే ఉన్నాయి. నేడు సరిగ్గా అదే జరిగింది. కార్మికవర్గంపై కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం ఎంత కుట్ర పూరితంగా ఉందన డానికి పెట్టు బడుల ఉపసంహరణ నిర్ణయమే తార్కాణం. ప్రగతి సరిగ్గా లేదని పెట్టుబడులను ఉపసంహరి స్తున్నట్లు చెప్పే కేంద్రానికి డిసిఐలో ఏం తక్కువైందని (లాభాల్లో ఉన్నా) అమ్మేందుకు ఎందుకు తెగబడుతుందంటూ మేధావులు ప్రశ్నిస్తున్నారు.

డిసిఐతో పాటు తాజాగా స్టీల్‌ప్లాంట్‌లో పెట్టుబడుల ఉప సంహరణపై 'రణం' మొదలుకానుంది. కేంద్ర ఉక్కుశాఖ మిగతా 4లో..


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న చంద్రబాబు

జన్మభూమి పూర్తయ్యేసరికి సమస్యలన్నీ పరిష్కరించాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు
- విమానాశ్రయంలో ఘనస్వాగతం

ప్రజాశక్తి - విశాఖపట్నం

ఐదో విడత జన్మభూమి పూర్తయ్యేనాటికి గతంలోనూ, ప్రస్తుతం ప్రజల నుంచి అందిన వినతులన్నింటినీ పరిష్కరించాలని ఉన్నతాధికారులను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. గురువారం విశాఖలోని పోర్టు గెస్ట్‌హౌస్ నుంచి ముఖ్యమంత్రి అన్ని శాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జన్మభూమి-మాఊరు కార్యక్రమ ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, ఏ రోజు అందిన పిటిషన్లు ఆ రోజే ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసి పరిష్కరించాలన్నారు. అవసరమైతే కార్యాలయాల్లో రేయింబవళ్లు ఉండి పిటిషన్ల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వినతుల అందజేసినవారికి వెంటనే వారి మొబైల్స్‌కు ఆన్‌లైన్ ఎక్‌నాలెడ్జ్‌మెంట్ వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఏరోజుకారోజు పిటిషన్లను ఆర్థిక, ఆర్థికేతర, వ్యక్తిగత, సామూహిక వినతులుగా విడగొట్టి, వాటిని తక్షణమే పరిష్కరించాలన్నారు. అంశాల వారీగా ప్రజల నుంచి సేకరించిన ఫీడ్ బ్యాగ్ ఆధారంగా ప్రజలు వేటిపై ఎక్కువ సంతృప్తిని వ్యక్తం చేశారు, వేటిపై అసంతృప్తిని వ్యక్తం చేశారో తెలియజేస్తూ రేటింగ్ జాబితాను రూపొందించాలన్నారు. టాప్‌టెన్, లాస్టు టెన్‌పై ప్రత్యేక దృష్టి సూరిస్తూ, టాప్ టెన్, లాస్టు టెన్ ర్యాంకింగ్ రావడాన్ని విశ్లేషించాలన్నారు. పంచాయతీరాజ్, హెల్త్, డ్వాక్రా, వెటర్నరీ తదితర శాఖ ర్యాంకింగ్‌లు అదమంగా ఉండటానికి గల కారణాలను ఆయా శాఖల ఉన్నతాధికారులు వివరణ అందజేయాలని అదేశించారు. శుక్రవారం విద్య-వికాశం అంశంపై చర్చలు జరగనున్న నేపథ్యంలో విద్యార్థులందరికీ ఈ చర్చల్లో భాగస్వాములను చేయాలని విద్యాశాఖల ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి చంద్రమౌళి, జన్మభూమి కార్యక్రమం జిల్లా ప్రత్యేక అధికారి వైవి అనురాధ, జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తదితరులతో పాటు రాష్ట్రస్థాయి రియల్ టైమ్ గవర్నెన్స్, కేంద్ర నుంచి అన్ని శాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ఘనస్వాగతం

శుక్రవారం నర్సీపట్నంలోని ధర్మసాగర్‌లో జరగనున్న జన్మభూమి కార్యక్రమంలో పాల్గొనడానికి ముఖ్యమంత్రి గురువారం రాత్రి విశాఖ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎంవివిఎస్.మూర్తి, దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ తదితరులు స్వాగతం పలికారు.

హోరాహోరీగా సౌత్ జోన్ క్రికెట్ పోటీలు

వార్త 12లో..

గీతోపదేశం

వీళ్లంతా మన ప్రసంగం వినడానికి రాలేదు సార్.. సమస్యలపై నిలదీయడానికి వచ్చారు...





పిల్లలకు విషమిచ్చి.. తల్లిదండ్రుల ఆత్మహత్య

- ఒకే కుటుంబంలో నలుగురు బలవన్మరణం
- కుటుంబ సమస్యలే కారణమని లేఖలో వెల్లడి
- మృతులు ప్రకాశం జిల్లా కనిగిరివాసులు

పిల్లలకు విషమిచ్చి.. తల్లిదండ్రులు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆరిలోవ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. ఆత్మహత్య చేసుకుంటున్నామని చెన్నయ్‌లోని తమ బంధువులకు మెసేజ్ పెట్టారు. దీంతో చెన్నయ్‌లో ఉంటున్న బంధువులు ఆరిలోవ సిఐకు సమాచారం అందించారు. రాత్రి సుమారు 7 గంటల నుంచి చెప్పిన అడ్రస్ కనుక్కునే పనిలో పడి పోలీసులకు ఎట్టకేలకు గుర్తించారు. ఇంటి తలుపులు తీసి చూసే సరికి భార్య, భర్తలు ఎదురెదురుగా ఉరేసుకొని కనిపించగా, మంచంపై ఇద్దరు పిల్లలు విగత జీవులుగా పడి ఉన్నారు. అప్పటికే నలుగురు మృతి చెందినట్టు పోలీసులు గుర్తించారు. -వార్త 3లో..



మాట్లాడుతున్న లక్ష్మీభార్గవి

పల్లె వాతావరణం కనిపించేలా సంక్రాంతి

ప్రజాశక్తి-డాబాగార్డెన్స్

పల్లె వాతావరణం ప్రతిబింబించేలా సంక్రాంతి పండుగను విశాఖలో ఈ నెల 11న వైభవంగా నిర్వహించనున్నట్లు మా సంస్కృతి కళాపరిషత్ వ్యవస్థాపకులు దువ్వాడ లక్ష్మీభార్గవి తెలిపారు. డాబాగార్డెన్స్ విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ద్వారకానగర్ బివికె కళాశాల ఎదురుగా శ్రీ కృష్ణవిద్యా మందిర్ ప్రాంగణంలో ఈ సంబరాలు ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో భాగంగా ముగ్గులు, పతంగుల పోటీలు, సంక్రాంతి సంప్రదాయ వంటల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. విజెఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు మాట్లా డుతూ, నగరంలో కనుమరుగవుతున్న సంప్రదాయాన్ని చూపించడం ఆనందదాయకమన్నారు. విజేతలుగా నిలిచిన మొదటి ముగ్గురుకు బహుమతులను అందజేస్తామని చెప్పారు. ఆసక్తి గల వారు 97050 11144 నెంబర్‌ను సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో విజెఎఫ్ సంయుక్త కార్యదర్శి దాడి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసిత కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌లోని నిర్వాసిత కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు బొడ్డు పైడిరాజు కోరారు. కర్మాగారంలోని సిఎస్‌డి డిపార్ట్‌మెంట్‌లో కాంట్రాక్టు పనులు చేస్తున్న ఎస్‌కెఈసి, యుఎఫ్‌సి సంస్థలు నిర్వాసిత కాంట్రాక్టు కార్మికులను తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని, దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఈ విషయమై గురువారం ఆయన నేతృత్వంలో నాయకులు డైరెక్టర్(కమర్షియల్) రే చౌదరిని కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం బొడ్డు పైడిరాజు మాట్లాడుతూ, గత 30 సంవత్సరాలుగా లోడింగ్, అన్‌లోడింగ్ పనులు నిర్వహిస్తున్న సూపర్‌వైజర్లను తొలగించాలని చూస్తున్నారని, ఇది సమంజసం కాదన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు బిజి.నాయుడు, యు.సన్యాసిరావు, సిహెచ్.నాగరాజు, యలమంచిలి అప్పలరాజు, పెనుమర్తి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణ తప్పనిసరి : విప్ డొక్కా

కలెక్టరేట్ : ఎస్‌సి వర్గీకరణ జరిగి తీరుతుందని శాసన మండలి సభ్యులు, ప్రభుత్వ విప్ డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. తాను వర్గీకరణ కోసం కృషి చేస్తున్నానని చెప్పారు. విప్ పదవి పొందిన తరువాత తొలిసారిగా నగరానికి వచ్చిన ఆయన్ని గురువారం ఒక హోటల్‌లో విశాఖ మాదిగ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన సన్మానించారు. ఈ సందర్భంగా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి చంద్రబాబు విజన్‌తో పనిచేస్తున్నారన్నారు. మంచి ఫలితాలు సాధించాలనే పట్టుదల ఆయనలో ఉందని చెప్పారు. రెల్లి, మాదిగ వంటి వెనుకబడిన కులాల అభివృద్ధికి, అన్ని కులాలలోని అణగారిన, పేదల పక్షాన తాను ఉంటానన్నారు. తనపై పేదల పక్షపాతి ముద్ర ఉండాలని కోరుకుంటానని చెప్పారు.

7న మంత్రి లోకేష్ పర్యటన

అనంతగిరి : ఈ నెల 7వ తేదీ అనంతగిరిలో జన్మభూమి గ్రామసభలో రాష్ట్ర పంచాయతీరాజ్, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ పర్యటించనున్నట్టు అరకు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కిడారి సర్వేశ్వరరావు, జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ లాలం భవానీ తెలిపారు. గురువారం మండలంలో పర్యటించిన వారు హరిత హిల్ రిసార్ట్స్ వద్ద ఏర్పాటుచేయనున్న సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ జన్మభూమిలో పాల్గొనే లోకేష్, ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంటారన్నారు. విద్యార్థులతో నిర్వహించే పాదయాత్ర కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అధిక సంఖ్యలో గిరిజనులు హాజరై మంత్రి పర్యటనను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాడేరు సబ్ కలెక్టర్ డికె.బాలాజీ, జెడ్‌పి వైస్ ఛైర్మన్ అప్పారావు, రాష్ట్ర ఫైనాన్స్ డైరెక్టర్ లక్ష్మీ, ఎంపిపి జి.పైడితల్లి, టిడిపి మండల నాయకులు ఆనంద్, కె.బుజ్జిబాబు, సిహెచ్.రాజ్‌కుమార్, అప్పారావు, సిఐ వెంకినాయుడు, అనంతగిరి ఎస్ఐ వెంకన్న పాల్గొన్నారు.

పాఠశాలల్లో వసతులకు రూ.5,200 కోట్లు

-విశాఖ జిల్లాకు రూ.300 కోట్లు - నియోజకవర్గానికి రూ.20 కోట్లు

-త్వరలో 14 వేల టీచర్ పోస్టుల భర్తీ

-యూనివర్సిటీలో పోస్టుల భర్తీకి సన్నాహాలు

ప్రజాశక్తి - చోడవరం

పాఠశాలల్లో వసతులు మెరుగుపరచడానికి రూ.5,200 కోట్లు ఖర్చు చేయనున్నామని రాష్ట్ర మానవవనరుల అభివృద్ధిశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజుకు మాతృవియోగం నేపథ్యంలో ఆయనను పరామర్శించడానికి గురువారం చోడవరం వచ్చిన మంత్రి ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మౌలిక వసతుల కోసం అధికంగా ఖర్చు చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా జిల్లాకు రూ.300 కోట్లు, ఒక్కో నియోజకవర్గానికి రూ.20 కోట్లు చొప్పున నిధులు అందుతాయని చెప్పారు. ప్రతి పాఠశాలలోనూ బెంచీలు ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో 14 వేల ఉపాధ్యాయ పోస్టులు, యూనివర్శిటీల్లో ఆచార్య పోస్టులు భర్తీకి సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. వీటిలో ఎటువంటి అవకతవకలు చోటు చేసుకోకుండా ఉండేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. విద్యాభివృద్ధిలో మోడల్ స్టేట్‌గా తయారు చేయడానికి పూనుకున్నామన్నారు. ప్రయివేటు విద్యావ్యవస్థలో స్టడీ అవర్స్‌ను తగ్గించి, విద్యార్థులపై ఒత్తిడి లేకుండా చేయడమే కాకుండా, ఆత్మహత్యల నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గోవాడ సుగర్స్ ఛైర్మన్ గూనూరు మల్లునాయుడు, టిడిపి నాయకులు వినపోలు వెంకటేశ్వర్లు, సీతా వెంకటరమణ, సుగర్స్ ఎండి కెఆర్ విక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

చోడవరం నుంచి పోటీ చేయకూడదా ?

వచ్చే ఎన్నికల్లో చోడవరం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయకూడదా అంటూ మంత్రి గంటా ప్రశ్నించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతున్నప్పుడు మీరు వచ్చే ఎన్నికల్లో ఏ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఏం చోడవరం నుంచి పోటీ చేయకూడదా అని ఆయన బదులిచ్చారు. దీంతో అక్కడున్న వారు ఒక్కసారిగా చప్పట్లు చరిచారు. గంటా ఈ ప్రకటనపై నియోజకవర్గంలో చర్చ మొదలైంది. గతంలోనూ గంటా తనయుడు జయదేవ్ తీసిన సినిమా రిలీజ్ ముందు చోడవరం వచ్చినప్పుడు తాను చోడవరం నుంచి పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. అప్పట్లో ఇదేమీ లేదన్నట్లుగా ఆయన అనుచరులు తోసిపుచ్చినా, ప్రస్తుతం గంటా మాటల్లో మాత్రం చోడవరం మీద ఇంకా మమకారం తగ్గలేనట్లు కనబడుతుంది. గతంలోనూ ఇక్కడ ఎమ్మెల్యేగా పనిచేసి తనకంటూ ఒక ముద్ర వేసుకున్నారు.

అయ్యన్న ఇలాకాలో అధ్వాన రహదారి

అవస్థలు పాల్జేస్తున్న జోగుంపేట, మర్రిపాలెం రోడ్డు

పట్టించుకోని అధికారులు, నేతలు

ప్రజాశక్తి- గొలుగొండ

రెండు మండలాలకు ప్రధానరహదారి ఉన్న జోగుంపేట, మర్రిపాలెం రోడ్డు నరకప్రాయమై ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. నిండా గోతులుమయమై రాళ్లుతేలి, ప్రయాణసంకటంగా మారింది. మంత్రి అయ్యన్న పాత్రుడినియోజకవర్గంలోని రోడ్డు దుస్థితి ఇలా ఉంటే, ఇంకా ఎవరికి చెప్పుకోవాలని పలువురు ప్రశ్నిస్తున్నారు.

గొలుగొండ మండలం జోగుంపేట నుండి కొయ్యూరు మండలం మర్రిపాలెం వరకు 7 కిలోమీటర్ల మేర రోడ్డును ఎనిమిదేళ్ల క్రితం రూ. 5 కోట్ల రైడ్ పథకం నిధులతో నిర్మించారు. కొన్నాళ్లపాటు బాగానే ఉన్నా, రెండేళ్లగా ఈ రోడ్డు అధ్వానస్థితికి చేరుకుని ప్రజలను అవస్థలు పాల్జేస్తోంది. ముఖ్యంతో రోడ్డంతా శిథిలమై గోతులమయం కావడంతో వాహనదారులు, ప్రజలు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీకాదు. మారుమూల గ్రామాల్లో సైతం రోడ్డు నిర్మాణం, పటిష్టపరుస్తున్నామని చెపుతున్న ప్రభుత్వం, రెండు మండలాల ప్రజల రవాణాకు పెద్దదిక్కుగా ఉన్న ఈ రోడ్డుపై ఎందుకు నిర్లక్ష్యం చూపుతోందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రెండు మండలాల పరిధిలోనిదాపు 15 పంచాయతీల ప్రజలు ఈ రోడ్డుమీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. కొయ్యూరు మండలానికి చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాడేరు ఐటిడిఎ కార్యాలయానికి వెళ్లాలంటే దగ్గరగా వుంటుందని ఈ రహదారినే ఆశ్రయిస్తారు. కొయ్యూరు మండలంలో గ్రామాలన్నింటికీ మండలకేంద్రానికి ఈ రోడ్డు గుండానే వెళితే తక్కువ దూరం అవుతుంది. ఇలా అనేక గ్రామాల ప్రజలు, గిరిజనులకు దగ్గర దారిగా ఉన్న జోగుంపేట రోడ్డును మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వపరంగా నిధులు మంజూరు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి అయ్యన్నపాత్రుడు నియోజకవర్గంలోని రోడ్డు దుస్థితి ఇలా ఉండడంపై పలువురు ముక్కున వేలేసుకుంటున్నారు. రెండు మండలాల ప్రజల దురదృష్టంగా పలువురు అభివర్ణిస్తున్నారు.


గోతులతో రాళ్లుతేలిన జోగుంపేట, చిట్టింపాడు రోడ్డు

పిల్లలకు విషమిచ్చి.. తల్లిదండ్రుల ఆత్మహత్య



మంచంపై విగత జీవులుగా పడి ఉన్న చిన్నారులు

ఒకే కుటుంబంలో నలుగురు బలవన్మరణం
కుటుంబ సమస్యలే కారణమని సూసైడ్ నోట్‌లో వెల్లడి
మృతులు ప్రకాశం జిల్లా కనిగిరివాసులు

ప్రజాశక్తి - ఆరిలోవ

ఇరుగు పొరుగు వారితో సంబంధాల్లేవు.. తమలో తామే మదనపడ్డారు. సమస్యలన ధైర్యంగా ఎదుర్కోవాల్సిది పోయి ఆత్మహత్యే శరణ్యమనుకుని ముక్కుపచ్చలారని తమ ఇద్దరు చిన్నారులకు విషమిచ్చారు. ఆపై వారూ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆరిలోవ ముస్తాఫా కాలనీలో జరిగిన ఈ ఘటనతో స్థానికంగా విషాదం నెలకొంది.

పోలీసుల కథనం ప్రకారం ప్రకాశం జిల్లా కనిగిరి ప్రాంతానికి చెందిన దేవరెడ్డి రాజేష్ రెడ్డి(35), సౌమ్య భార్యాభర్తలు. వారికి విష్ణు(9) జాహ్నవి(5) ఇద్దరు పిల్లలతో గత ఎనిమిది నెలల నుంచి ఆరిలోవ ముస్తాఫా కాలనీలో ఒక ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. తొలి నుంచీ వీరికి ఇరుగు పొరుగు వారితో పెద్దగా సంబంధాలుండేవి కావు. గురువారం సాయంత్రం తాము ఆత్మహత్య చేసుకుంటున్నామని చెన్నయిలోని తమ బంధువులకు మెసేజ్ పెట్టారు. దీంతో చెన్నయిలో ఉంటున్న బంధువులు ఆరిలోవ సిఐకు సమాచారం అందించారు. రాత్రి సుమారు 7 గంటల నుంచి చెప్పిన అడ్రస్ కనుక్కునే పనిలో పడి ఎట్టకేలకు గుర్తించారు. ఇంటి తలుపులు తీసి చూసే సరికి భార్య, భర్తలు ఎదురెదురుగా ఉరేసుకొని కనిపించగా, మంచంపై ఇద్దరు పిల్లలు విగత జీవులుగా పడి ఉన్నారు. అప్పటికే నలుగురు మృతి చెందినట్టు పోలీసులు గుర్తించారు. ఎసిపి రామచంద్రరావు క్లూస్ టీమ్‌తో సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతులు రాసిన సూసైడ్ ఉత్తరం కూడా లభించింది. కుటుంబ సమస్యలు కారణంగా ఆత్మహత్యకు పాల్పడుతున్నామనీ, తమ చావుకు ఎవరూ బాధ్యులు కారనీ రాసి ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. గత కొన్ని నెలలుగా ఇరుగు పొరుగు వారితో సంబంధం లేకుండా ఉండడంతో వారి ఆత్మహత్యకు కారణాలు తెలియలేదు. ఆరిలోవ సిఐ షణ్ముఖరావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు.

సినీ రచయితలకు వర్క్‌షాపు

డాబాగార్డెన్స్ : వర్ధమాన సినీ రచయితల కోసం ఈ నెల 26, 27,28 తేదీల్లో రామాటాకీస్ దరి విశాఖహ్యాపీ ఫంక్షన్ హాల్‌లో వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ప్రముఖ నాటక, సినీరచయిత, తెలుగు సినీ రచయితల వెల్ఫేర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆకెళ్ళ వెంకట సూర్యనారాయణ తెలిపారు. డాబాగార్డెన్స్ విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వర్క్‌షాపు ఉంటుందని తెలిపారు. గతంలో స్క్రీన్‌ప్లే క్లాసులు పదిసార్లు నిర్వహించామని చెప్పారు.

సినిమా... సినిమా



టూ కంట్రీస్ : జోతి, వి మ్యాక్స్ 3, శ్రీరామ, శ్రీ నరసింహ (గోపాలపట్నం)

ప్రోజెక్టు : శ్రీ లీలామహల్, పరమేశ్వరి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం)

జుమంజి : శారద, వెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం)

ఒక్క క్షణం : వి మ్యాక్స్ 1, కిన్నెర, శ్రీ లక్ష్మీ నరసింహ (104 ఏరియా), సత్యం (గోపాలపట్నం)

హలో : మెలోడి, సంగం, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (సుకన్య)

ఎంసిఎ : జగదాంబ, కామేశ్వరి, శ్రీకన్య, శ్రీ లక్ష్మీ నరసింహ స్క్రీన్ 1 (104 ఏరియా), శంకర (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), ఎస్‌విసి లిఖిత (శ్రీహరిపురం), కన్య స్క్రీన్ 1 (గాజువాక), ఎస్‌టిబిఎల్ స్క్రీన్ 2 (షీలానగర్)

ఇఊ : వి మ్యాక్స్ 3

ఖాకీ : వెంకటేశ్వర స్క్రీన్ 2

టైగర్ జిందగీ హై : రమాదేవి

రాజా ది గ్రేట్ : శ్రీకాంతి

జవాన్ : వి మ్యాక్స్ 2

స్టీల్‌ప్లాంట్ వాటాల అమ్మకాన్ని వ్యతిరేకించాలి

విశాఖపట్నం : విశాఖ స్టీల్‌ప్లాంట్ వాటాలు 10శాతం అమ్మాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు రాజ్యసభలో స్టీల్ శాఖ మంత్రి ప్రకటించడాన్ని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నరసింగరావు, సిఐటియు గ్రేటర్ విశాఖనగర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆర్.కె.ఎస్.వి.కుమార్, ఎం.జగ్గునాయుడులు తీవ్రంగా ఖండించారు. దేశంలోని ప్రతిష్ఠాత్మకమైన విశాఖ స్టీల్‌ను ప్రయివేటుకు కారుచౌకగా కట్టబెట్టడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. దీనిని విశాఖ వాసులంతా ముక్తకంఠంతో వ్యతిరేకించాలని కోరారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. విశాఖ స్టీల్‌కు నష్టాలస్తున్నాయనే సాకుతో ప్రయివేటీకరణను కేంద్ర ప్రభుత్వం ముందుకు తీసుకొస్తోందన్నారు. ప్రపంచంలో స్టీల్ పరిశ్రమలు సంక్షోభంలో ఉన్నాయన్నారు. దేశంలో కూడా అన్ని స్టీల్ కంపెనీలు నష్టాల్లో వున్నాయి. ఎస్సార్, భూషణ్ స్టీల్ కంపెనీలను వేలం వేయాలని బ్యాంకులు నిర్ణయించాయని వారు గుర్తు చేశారు. విశాఖస్టీల్‌కు నష్టాలకు ప్రధాన కారణం సొంత గనులు లేక పోవడమేనన్నారు. దీని వల్ల ఇతర అన్ని స్టీల్ ప్లాంట్‌లకు టన్ను ముడి ఇనుము రూ.500లకు అభిస్తుంటే విశాఖ స్టీల్ యాజమాన్యం టన్నుకు రూ.600లను వెచ్చించాల్సి వస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం స్వంత గనులు సమకూర్చితే విశాఖ స్టీల్ లాభాలు గడించే సమర్ధత వుందని స్పష్టం చేశారు. గతంలో కూడా బిజెపి, కాంగ్రెస్ ప్రభుత్వాలు విశాఖ స్టీల్‌ప్లాంట్ వాటాలు అమ్మాలని ప్రయత్నించాయనీ, ప్రజలు, కార్మికులు, ఐక్యంగా పోరాడి అడ్డుకున్నారనీ వివరించారు. ఇప్పుడు కూడా ఐక్య పోరాటాలతో విశాఖస్టీల్ ప్రయివేటీకరణ ప్రయత్నాలను కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు, ప్రజలు వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు.

విక్రయ ప్రతిపాదన విరమించుకోవాలి

విశాఖపట్నం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో 10 శాతం పెట్టుబడుల ఉపసంహరణ ప్రతిపాదనకు ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం తెలపడం గర్హనీయమని, ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం నగర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ నగర కార్యదర్శి బి గంగారావు గురువారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని ఏకైక అతిపెద్ద ప్రభుత్వ రంగ విశాఖ స్టీల్ ప్లాంట్ అని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నుల రూపేణా రూ.1400 కోట్లను ఏటా స్టీల్‌ప్లాంట్ చెల్లిస్తోందన్నారు. నవరత్న కంపెనీగా వెలుగులీనుతున్న స్టీల్‌ప్లాంట్‌లో పది శాతం వాటాలను విక్రయించడానికి మోడీ ప్రభుత్వం తీసుకున్న చర్య పూర్తిగా ప్రయివేటీకరించడానికి నాంది అని వివరించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించాలన్న కేంద్ర ప్రభుత్వ కుట్రను విశాఖ వాసులంతా ఐక్యంగా తిప్పికొట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించని పక్షంలో టిడిపి ప్రభుత్వ చిత్తశుద్ధినీ శంకించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని స్పష్టం చేశారు.

మద్యం దుకాణం ఎత్తివేతపై మహిళల హర్షం

కంచరపాలెం : మద్యం దుకాణ ఏర్పాటును యజమాని విరమించుకోవడంతో మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం దుకాణ యజమానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఇందిరానగర్‌లో మహిళలు వంటావార్పు కార్యక్రమాన్ని చేపట్టి సామూహిక భోజనాలు చేసి, దీక్షను విరమించారు. హైవేను ఆనుకుని ఇందిరానగర్‌లో మద్యం దుకాణాన్ని తొలగించాలని ధాన్ ఫౌండేషన్ ఆధ్వర్యాన గత పదిరోజులుగా మహిళలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. వీరికి మద్దతుగా సిపిఎం కంచరపాలెం జోన్ కమిటీ నిలిచింది. ఈ సందర్భంగా పార్టీ జోన్ కార్యదర్శి పద్మ మాట్లాడుతూ బెల్ట్‌షాపులను ఎత్తేస్తామని, మద్యాన్ని నియంత్రిస్తామని గద్దెనెక్కిన ప్రభుత్వం నేడు మద్యాన్ని ఏరులై పారించడం దుర్మార్గమన్నారు. మద్యం దుకాణాలను మహిళలు వ్యతిరేకిస్తే ఒక చోట నుంచి వేరే చోటుకు మార్చుతున్నారే తప్పా వాటిని నియంత్రించడానికి చర్యలు తీసుకోవడం లేదని ధ్వజమెత్తారు. మద్యం కారణంగానే రోడ్డు ప్రమాదాలు, హత్యలు, అత్యాచారాలు, మహిళలపై హింస వంటివి పెరుగుతున్నాయన్నారు. అయితే మద్యాన్ని ఆదాయ వనరుగా చూడడంతోనే నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. విశాఖ ఎస్ఇజెడ్‌లో మూగ బాలికపై జరిగిన అత్యాచారం నిర్భయ ఘటన కంటే భయంకరంగా ఉందన్నారు. జనాభా ప్రాతిపదికన పాఠశాలలు, రేషన్ దుకాణాలు పెట్టకుండా మద్యం దుకాణాలు పెడుతున్న కారణంగానే ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే కంచరపాలెం మెట్టు నుంచి ఐటిఐ కూడలి వరకు సుమారు 15 మద్యం దుకాణాలుండగా కొత్తగా మరికొన్ని దుకాణాలను ఏర్పాటు చేయడం సరికాదన్నారు. జనావాసాల్లో మద్యం దుకాణాలను ఏర్పాటు చేస్తే మహిళలంతా ఐక్యంగా అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో 36వ వార్డు మాజీ కార్పొరేటర్ బట్టా ఈశ్వరమ్మ, లీగల్ సెల్ బాధ్యులు కె అనురాధ, ఐద్వా జోన్ అధ్యక్షురాలు పి పుష్పాంజలి సాహు తదితరులు పాల్గొన్నారు.



భోజనాలు చేస్తున్న మహిళలు

గృహిణిని వేధించిన
భర్త, అత్తలపై కేసు నమోదు

ప్రజాశక్తి-తగరపువలస

వరకట్నం వేదింపులు కేసులో బాదితురాలి ఫిర్యాదు మేరకు భర్త, అత్తలపై భీమిలి పోలీసులు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎస్ఐ పి శ్రీనివాసరావు కథనం ప్రకారం. భీమిలి మండలం దాకమర్రి గ్రామానికిచెందిన రోజాతో దాకమర్రి పంచాయితీకి చెందిన శివకు 2013లో వివాహం అయ్యింది. వివాహ సమయంలో రోజా తల్లి దండ్రులు రూ. 2 లక్షలు కట్నం ఇచ్చారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. పుట్టింటికి వెళ్లి అదనపు కట్నం తేవాలంటే గత కొంత కాలంగా భర్త శివ, అత్త రాములమ్మ వేధిస్తున్నారు. బాధితురాలు రోజా ఫిర్యాదు మేరకు భర్త, అత్తలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ పి శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ పెయింట్స్ గొడౌన్‌కు సీల్

కూర్మన్నపాలెం : లేబుల్స్ మార్చి నకిలీ పెయింట్స్ అమ్ముతున్న గొడౌన్‌ను గుర్తించి పోలీసులు సీల్ చేశారు. అగనంపూడి తలారివానిపాలెంలో ఓ వ్యక్తి ఆల్ట్రా పెయింట్స్ కంపెనీ పేరుతో లేబుల్స్‌ను మార్చి అమ్ముతున్న ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. దీనిపై స్పందించిన సౌత్ ఎసిపి రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో గొడౌన్‌కు సీల్ వేశారు. పోలీస్‌లు అందించిన సమాచారం మేరకు ఆల్ట్రా పెయింట్స్ కంపెనీ యాజమాన్యం ఈ ప్రాంతంలో నకిలీ జరుగుతున్నట్లు పక్కా సమాచారంతో ఫిర్యాదు చేశారని దీనితో తలారివానిపాలెం గొడౌన్‌పై రైడ్ చేయగా నకిలీ లేబుల్స్‌తో పెయింట్స్, ఆల్టెక్‌వాల్ పుట్టీ, వైట్‌వాస్ తదితర పెయింట్స్ ఉన్నట్లు గుర్తించారు. వాటిని పరిశీలించి నకిలీ పెయింట్స్‌గా గుర్తించి గొడౌన్‌కు సీల్ వేశారు. గతంలో ఆటోనగర్ ఇదే కంపెనీ నకిలీ పెయింట్స్‌ను అమ్ముతుండగా గుర్తించి వారిపై కేసు నమోదు చేయగా అక్కడ నుంచి గొడౌన్ మార్చి తలారివానిపాలెంలో కొత్త గొడౌన్ ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో గాజువాక సిఐ ఇమ్మానుయేల్ రాజు, ఎస్ఐలు అప్పలరాజు, శ్రీనువాసరావు తదితరులు పాల్గొన్నారు.

చెన్నైలో భారత నాస్తిక మహాసభలు

విశాఖపట్నం ప్రతినిధి : ఈ నెల 5, 6, 7 వ తేదీల్లో చెన్నైలో ప్రపంచ నాస్తిక మహా సభలు జరుగుతున్నాయని భారత నాస్తిక సమాజం ఎపి అధ్యక్షులు తుంపాల శ్రీరామ్మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నైలోని ద్రవిడ కజగరావిజయవాడలోని నాస్తిక కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 5, 6, 7 తేదీలలో ప్రపంచ నాస్తిక మహాసభలు తమిళనాడులోని పెరియార్‌ా ముని అమ్మాళ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఆఫ్ భవనంలో ఆరుచురావల్లి నగరంలో జరుగుతున్నాయన్నారు. ద్రవిడ కజగం నేత కె వీరమణి, నాస్తిక కేంద్రం నాయకులు డాక్టర్ విజయం, డాక్టర్ సమరం ఈ సభలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రముఖ రచనలు ఆవిష్కరించనున్నారు. గౌరీమేర్ లేలండ్ (లండన్), ఎం గోవిందస్వామి (మలేషియా) తదిత దేశాల నుండి ప్రతినిధులతో పాటు మొత్తంగా 2000 మంది హాజరుకానున్నట్లు తెలిపారు. విశాఖతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల నుండి 60 మంది వస్తున్నారన్నారు.

ఆదరణ ఓర్వలేకే బిజెపి అడ్డంకులు

డాబాగార్డెన్స్ : ఢిల్లీలోని, రాష్ట్రంలో ఆమ్ ఆద్మీ పార్టీకి పెరు గుతున్న జనాదరణనుచూసి ఓర్వలేక కేంద్రలో బిజెపి ప్రభుత్వం అడుగడుగునా ఆటంకాలు సఅష్టించి పార్టీ ఎదుగుదలను అడుకుంటుందని ఆ పార్టీ విశాఖ జిల్లా ఇన్‌చార్జ్ డాక్టర్ శీతల్ విమర్శించారు. డాబాగార్డెన్స్ విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ ప్రభుత్వం ప్రజల శ్రేయస్సు కోసం అనేక పథకాలను ప్రవేశ పెట్టిందని వెల్లడించారు. ఆప్ ప్రభుత్వం నేరుగా ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందివ్వడానికి పథకాలు అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వపరంగా అన్ని రకాల సర్టిఫికెట్లు, జనన, మరణ, ఆదాయ, చిరునామా, పెన్షన్, కుల, తదితర సేవలు ప్రజల ఇంటివద్దకే చేరవేయడానికి పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. పార్టీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకుందని తెలిపారు. అవినీతి రహిత సుపరిపాలనను అందిస్తోంన్నారు. ఈ క్రమంలోనే ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వానికి జనాదరణ విపరీతంగా పెరిగిందన్నారు. ఇది చూసి బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఓర్వ లేక ఢిల్లీలో ఆప్ పెట్టిన పలు సంక్షేమ పథకాలను అడ్డుకుంటుందన్నారు.

రేషన్ డిపోల్లో ఈ పాస్ యంత్రాల మొరాయింపు

చంద్రన్న కానుకల కోసం లబ్ధిదారుల ఇక్కట్లు

పాత పద్ధతిలోనే ఇవ్వాలని ఆందోళన

ప్రజాశక్తి - ఆరిలోవ

ఈ నెల సంక్రాంతి సందర్భంగా తెల్లరేషన్ కార్డుదారులకు ఇస్తున్న చంద్రన్న కానుకల కోసం రేషన్ డిపోల వద్ద పేదలు పడిగాపులు కాస్తున్నారు. ఈ నెల సాధారణ రేషన్ సరుకులతో పాటు చంద్రన్న కానుకలు ఇస్తుండడంతో లబ్ధిదారులు ఒకేసారి రావడంతో చాలా రద్దీగా ఉంటుంది. దీనికి తోడు సర్వర్లు సరిగా పనిచేయక పోవడంతో క్యూలో నిలబడలేక లబ్ధిదారులు విసుగెత్తి పోతున్నారు. వీటికోసం మూడు, నాలుగు రోజుల పాటు రేషన్ డిపోల చుట్టూ తిరగాల్సి వస్తుంది. దీనితో కూలి నాలి చేసుకుంటు జీవనం సాగిస్తున్న మహిళలు, పురుషులు రోజువారీ సంపాదించుకుంటున్న డబ్బులు పోతున్నాయని వాపోతున్నారు.

మహిళల ఆందోళన

మూడోవార్డు పరిధి ఇందిరానగర్‌లో 551 రేషన్ డిపో వద్ద గురువారం లబ్ధిదారులు కొంతసేపు ఆందోళన చేశారు. దీనికి ఐద్వా నాయకులు వి.చిట్టిరాణి మద్దతు తెలిపారు. ఈ పాస్ యంత్రాలను తొలిగించి పాత పద్ధతిలోనే రేషన్ సరుకులు ఇవ్వాలని నినాదాలు చేశారు. ఉచితంగా ఇస్తున్న సంక్రాంతి చంద్రన్న కానుకలు డిపోల్లో తమ వరకు వస్తాయో, రావో నని ఆందోళన చెందుతున్నారు. ఏ డిపోలోనైనా సరుకులు తీసుకోవచ్చని నిబంధనలు ఉన్నా కొన్ని డిపో నిర్వాహకులు తమ డిపో పరిధి కార్డుదారులకే సంక్రాంతి కానుకలు ఇస్తామని తిరిగి పంపించేస్తున్నారని కొంత మంది చెబుతున్నారు. ఇటు నెలవారి రేషన్‌తో పాటు సంక్రాంతి కానుకలు ఇస్తుండడంతో రెండు పర్యాయాలు వేలు ముద్రలు వేయడంతో మరికొంత ఆలస్యం అవుతుందని, ఒక్కొక్కసారి సర్వర్లు మొరాయిస్తుండంతో సరుకులు ఇవ్వడంలో ఆలస్యం అవుతుందని డిపో నిర్వాహకులు చెబుతున్నారు.



పాత పద్ధతిలో రేషన్ సరుకులు ఇవ్వాలని ఆందోళన చేస్తున్న మహిళలు



గురుకుల పాఠశాలలో ఏర్పాటుచేసిన సోలార్ హీటర్లు

గురుకుల పాఠశాలలో సోలార్ హీటర్లు

ప్రజాశక్తి - ఆరిలోవ

విశాఖ కేంద్రకారాగారం వద్ద గల శ్రీక్రిష్ణాపురం సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, పాఠశాలలో సోలార్ హీటర్లను ఏర్పాటు చేశారు. దీనికోసం రూ.11.5 లక్షలు ఎంపీ నిధులతో నాలుగు సోలార్ ప్యానళ్లతో పాటు నాలుగు హీటర్ ట్యాంక్‌లను ఏర్పాటు చేశారు. 1500 లీటర్ల సామర్థ్యం కలిగిన ఒక్కో వాటర్ ట్యాంక్ ద్వారా వేడి నీరు సరఫరా అవుతుంది. గురుకుల పాఠశాలలో నాలుగు పెద్ద స్నానాల గదులు ఉన్నాయి. ఒక్కొక్క గదికి 20 ట్యాప్‌ల ద్వారా వేడి నీరు వచ్చే విధంగా ఏర్పాటు చేశారు. ముఖ్యంగా చలి కాలంలో విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని ప్రిన్సిపల్ కె.కోటేశ్వరరావు తెలిపారు.

రెండోవార్డులో నేడు జన్మభూమి

ఆరిలోవ : రెండో వార్డు పరిధి జివిఎంసి కల్యాణమండపంలో ఐదో విడత జన్మభూమి-మాఊరు కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నట్టు జన్మభూమి కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 9 గంటలకు జన్మభూమి ప్రారంభమవుతుందని తెలిపారు. గత జన్మభూమిలో పింఛన్లు, రేషన్ కార్డులు, పట్టాలు, ఇతర సామాజిక అవసరాల కోసం చేసుకున్న దరఖాస్తుదారులైన లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. దీనిలో భాగంగా గురువారం వార్డు పరిధిలోని జివిఎంసి కల్యాణ మండపంలో డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ సర్వేక్షన్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌పై జన్మభూమి కమిటీ సభ్యుడు గాడి సత్యం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ యూనివర్సిటీ

మద్దిలపాలెం : ఆంధ్రా యూనివర్శిటీలో శుక్రవారం డయల్ యువర్ యూనివర్శిటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ హాల్లో ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో అధికారులతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఫోన్‌లో తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని పేర్కొన్నారు. నోటిఫికేషన్లు, దూర విద్యా వివరాలు, కోర్సులు, పిహెచ్‌డిలు, సర్టిఫికేట్ల జారీ వంటి విషయాల గురించి తెలుసుకోవచ్చని తెలిపారు. ఫోన్ ద్వారా సంప్రదించాలనుకునే వారు 0891-2844455 నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

ఎయులో జిఎస్‌టి సర్టిఫికెట్ కోర్సు

మద్దిలపాలెం : ఆంధ్రా యూనివర్శిటీ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలో జిఎస్‌టి సర్టిఫికెట్ ప్రోగ్రాం కోర్సును అందిస్తున్నామని, ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని విభాగాధిపతి ఆచార్య జి.సత్యనారాయణ తెలిపారు. రాత్రి 6 నుంచి 7.30 గంటల వరకు ఈ కోర్సును నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సెంట్రల్ కస్టమ్స్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్, చార్టర్డ్ అకౌంటెంట్స్, పరిశ్రమల నిపుణులు, అకడమిక్ నిపుణులు కోర్స్ రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీ పాస్ అయిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు రిజిస్ట్రేషన్, అప్లికేషన్ కోసం రూ.500 చెల్లించాలని, పూర్తి చేసిన దరఖాస్తులు విభాగానికి అందజేయాలని సూచించారు. ప్రవేశాలు పొందే వారు కోర్సు ఫీజు రూ.5000, కోర్సు పూర్తయ్యాక సర్టిఫికెట్ కోసం రూ.1,000 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఎయు వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

వైసిపిని విమర్శించే స్థాయి టిడిపికి లేదు

పీతల మూర్తియాదవ్

ప్రజాశక్తి-మద్దిలపాలెం

వైసిపిని విమర్శించే స్థాయి టిడిపి నాయకులకు లేదని వైసిపి నగర అధికార ప్రతినిధి పీతల మూర్తియాదవ్ అన్నారు. మద్దిలపాలెంలోని వైసిపి తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి దొంగల పార్టీ అంటూ బుధవారం జన్మభూమిలో మంత్రి సిహెచ్.అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలను ఆయన ఈ సందర్భంగా ఖండించారు. ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి అక్రమ రవాణాలో కీలక పాత్ర వహిస్తూ, అటవీ శాఖా మంత్రిగా ఉంటూ గెస్ట్ హౌస్‌లో అమ్మాయిలతో వ్యభిచారం చేస్తూ పట్టుబడిన అయ్యన్నకు వైసిపిని విమర్శించే అర్హతలేదన్నారు. రంగా హత్యకేసులో ముద్దాయి అయిన వెలగపూడి రామకృష్ణబాబుకు విశాఖలో ఆశ్రయం కల్పించి ఎమ్మెల్యేను చేసి నీతిమాలిన రాజకీయాలకు నగరంలో తెరలేపింది మీరేనని తీవ్ర స్థాయిలో ఆయనపై విరుచుకు పడ్డారు. పాదయాత్రలో జగన్‌కు లభిస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకే ఇటువంటి నీతిమాలిన వ్యాఖ్యలకు దిగజారుతున్నారని విమర్శించారు. వెంటనే అటువంటి వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని



మాట్లాడుతున్న మూర్తియాదవ్

డిమాండ్ చేశారు. లేని పక్షంలో వైసిపి శ్రేణులు నడిరోడ్డుపై ఆయనను అడ్డుకుంటాయని హెచ్చరించారు. ఎమ్మెల్యే వెలగపూడి తూర్పు నియోజకవర్గాన్ని జూదాలకు, కోడి పందాలకు నిలయం చేస్తున్నారని విమర్శించారు. నగరంలో ఇటువంటి విష సంస్కృతికి బీజాలు వేస్తున్నది టిడిపి నాయకులేనని ధ్వజమెత్తారు. మరో మంత్రి గంటా శ్రీనివాసరావు రెవెన్యూ రికార్డులను టాంపరింగ్‌లు చేయించి, భూకబ్జాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. తెలుగుదేశం పాలనలో నగరంలో నేరాలు, హత్యలు పెరిగిపోయి ప్రజలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఇటువంటి నాయకులా వైసిపిని విమర్శించేదని ప్రశ్నించారు.

ఆలయాల్లో నిఘా కెమెరాలు ఏర్పాటుచేయాలి

సిఐ షణ్ముఖరావు

ప్రజాశక్తి - ఆరిలోవ

నగరంలో శాంతి భద్రతల దృష్ట్యా, నేరస్తులను త్వరగా పట్టుకునేందుకు ఉపయోగపడే నిఘా కెమెరాలను ఆలయాల్లో ఏర్పాటుచేయాలని ఆరిలోవ సిఐ షణ్ముఖరావు సూచించారు. దీనిలో భాగంగా 1,2,3 వార్డుల పరిధిలో గల ఆలయాల కమిటీ సభ్యులతో గురువారం ఆరిలోవ పోలీస్టేషన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ షణ్ముఖరావు మాట్లాడుతూ, అనేక నేరాలను నిఘా కెమెరాల ఆదారంగానే ఛేదించినట్లు తెలిపారు. నిఘా కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే ఆయా పరిసరాల్లో పోలీసు బందుబస్తు ఉన్నట్టుగానే ఉంటుందని తెలిపారు. దీనితో ఆయా పరిసరాల్లో నేరాలు చేసేందుకు నేరస్తులు భయపడతారని చెప్పారు. ఇటీవల నిఘా కెమెరాల ద్వారా ఛేధించిన నేరాల గురించి వివరించారు. తక్కువ ఆదాయం వచ్చే దేవాలయాల్లో సిసి కెమెరాల ఏర్పాటు కష్టమవుతుందని కొంత మంది నిర్వాహకులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. చాలా మంది వీటి ఏర్పాటుకు రెండు నెలలు గడువు కావాలని తెలిపారని సిఐ చెప్పారు. ఈ సమావేశంలో ఎస్ఐ సంతోష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న సిఐ

వృద్ధులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - ఆరిలోవ

ఒకటో వార్డు వైసిపి అధ్యక్షుడు మొగ్గ ఆదినారాయణ జన్మదిన వేడుకను ఆరిలోవ కాలనీ, పాండురంగపురంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో ఉంటున్న వృద్ధులకు ఆయన పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు వార్డులోని పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు వైసిపి మహిళా అధ్యక్షురాలు కె.శిరీషా, నాయకులు పి.ఎ.బాలరాజు, శ్రీదేవి, ఫర్వీణ్, సుబ్బారావు, సాగరిక, వెంకట్, మాధవి, వాసు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వృద్ధులకు పండ్లు పంపిణీ చేసిన ఆదినారాయణ

నివేదిత,ఉషారాణిలకు ఎయు డాక్టరేట్

ప్రజాశక్తి-మద్దిలపాలెం

ఆంధ్రాయూనివర్శిటీ బోటనీ విభాగ పరిశోధక విద్యార్థిని టిఎం.ఎ.నివేదితకు ఎయు డాక్టరేట్ లభించింది. నివేదిత ఆచార్య బలరామస్వామి యాదవ్ పర్యవేక్షణలో 'నాన్-టింబర్ ఫారెస్ట్ ప్రొడెక్ట్స్ ఆఫ్ ట్రైబ్స్ ఇన్ శ్రీకాకుళం డిస్ట్రిక్ట్, ఆంధ్ర ప్రదేశ్, ఇండియా' అనే అంశంపై పరిశోధన గావించారు. ఈ మేరకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఎంవిఎస్ఎస్.ప్రకాష్ ప్రకటన విడుదల చేశారు. విసి ఆచార్య జి.నాగేశ్వరరావు ఆమెకు యోగ్యతా పత్రాన్నందించి అభినందించారు.

ఆంధ్రాయూనివర్శిటీ సంస్కృత విభాగం పరిశోధకులు తాతా ఉషారాణికి డాక్టరేట్ లభించింది. ఉషారాణి 'మయూర విరచిత సూర్య శతకే విద్యాంసహ యాకమ్ అధ్యయనం' అనే అంశంపై పరిశోధన చేసినట్లు డిప్యూటీ రిజిస్ట్రార్ టివి.సత్యవతీదేవి పేర్కొన్నారు. విసి ఆచార్య జి.నాగేశ్వరరావు యోగ్యతా పత్రానందించి అభినందించారు.



నివేదితకు యోగ్యతా పత్రాన్ని అందిస్తున్న విసి నాగేశ్వరరావు

6న హెల్త్ ఇన్ ఎడ్యుకేషన్

డాబాగార్డెన్స్: పాఠశాలల విద్యార్థులు ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దడానికి అవసరమైన హెల్త్ ఇన్ ఎడ్యుకేషన్-డిజిటల్ అండ్ ఫిజికల్ క్యాంపైన్‌ను తొలి సారిగా విశాఖలోని ఉక్కు నగరం చైతన్య పబ్లిక్ స్కూల్లో ఈ నెల6వ తేదీన నిర్వహిస్తున్నట్లు అన్నపూర్ణ చారిటబుల్ సొసైటీ ఫౌండర్ కె.మేఘన తెలిపారు. డాబాగార్డెన్స్ విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు, గౌరవ అతిథులుగా స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డి మధుసూదన్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, పైడా కష్ణప్రసాద్, పోలీసు కమిషనర్ టి.యోగానంద్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి

స్టీల్‌ప్లాంట్‌లో పెట్టుబడుల ఉపసంహా'రణం'

సహాయ మంత్రి విష్ణుదేవసాయి బుధవారం రాజ్యసభలో వైసిపి ఎంపీ విజయసాయిరెడ్డి వేసిన ప్రశ్నకు సమాధానంగా విశాఖ ఉక్కు నష్టాలకు మార్కెట్ అననుకూల పరిస్థితులను వెల్లడించారు. నియంత్రణ ఎత్తివేసే రంగాల్లో ఉక్కు ఉత్పాదనా రంగం ఒకటని మంత్రి సెలవిచ్చారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు లేకపోవడం, ఎన్ఎండిసికి బకాయి పడడం వంటివి ఈ కాలంలో స్టీల్‌ప్లాంట్‌పై మరింత భారాన్ని పెంచాయి. కానీ ప్రభుత్వ ఉద్దేశం చూస్తుంటే స్టీల్‌ప్లాంట్‌కు ఉన్న వేల ఎకరాల భూమిని కార్పొరేట్లకు కట్టబెట్టాలనే దీర్ఘకాలిక వ్యూహం కూడా లేకపోలేదు.

గిరిజన మూగ బాలికకు న్యాయం జరిగే వరకూ పోరాటం

హెచ్‌బిఎల్ కంపెనీ యాజమాన్యాన్ని అరెస్టు చేయాలి

ప్రజా సంఘాల ధర్నాలో నాయకులు

ప్రజాశక్తి-కలెక్టరేట్

అత్యాచారానికి గురైన గిరిజన మూగ బాలికకు న్యాయం జరగకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. ఘటనలో నిందితున్ని నిర్భయ చట్టం కింద కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి), గిరిజన సంఘం, ఐద్వా, జిల్లా బధిరుల సంఘం, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం ఎదుట గురువారం ఆందోళన జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బాధితురాలికి రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియో, ఇల్లు, భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. కేసును తారుమారు చేసేందుకు ప్రయత్నిస్తున్న హెచ్‌బిఎల్ కంపెనీ యాజమాన్యాన్ని, వారికి సహకరించిన ఇతర అధికారులనూ అరెస్టు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు భద్రత కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. రోజురోజుకూ దాడులు, హింస, అత్యాచారాలు, వేధింపులు రాష్ట్రంలో పెరుగుతున్నా చంద్రబాబు ప్రభుత్వం వాటిని నియంత్రించేందుకు చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర అధ్యక్షులు కోడూరు అప్పలనాయుడు, నగర అధ్యక్షులు పాల వెంకయ్య, జిల్లా ఉపాధ్యక్షులు, వేములవలస మాజీ సర్పంచి కోరాడ అప్పలస్వామి నాయుడు, ఐద్వా నగర, జిల్లా అధ్యక్షులు సూర్యమణి, ద్రాక్షాయణి, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, సుమిత్ర, గిరిజన సంఘం నాయకులు పృధ్వీరాజు, కోటిబాబు, వరలక్ష్మి, జిల్లా బధిరుల సంఘం నాయకులు చంద్రశేఖర్, బధిర భాష అనువర్తకులు లక్ష్మి, ఇతర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.


జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాల నేతలు

బాధితురాలిని పరామర్శ

కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న అత్యాచార బాధితురాలిని ప్రజా సంఘాల నాయకులు పరామర్శించారు. అధైర్య పడొద్దని, అండగా ఉంటామని భరోసానిచ్చారు.

ఎపిని నెంబర్‌వన్‌గా నిలపడమే లక్ష్యం

మంత్రి గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్‌ను 2029 నాటికి దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా కృషి చేస్తున్నారని మానవ వనరుల శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. దక్షిణ నియోజకవర్గంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో గురువారం జన్మభూమి- మన ఊరు కార్యక్రమం నిర్వహించారు. 22, 29 వార్డులకు సంబంధించి నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి గంటా శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర విభజనతో ఎపికి తీవ్ర నష్టం కలిగిందని, తీవ్రమైన లోటుతో ఉన్న రాష్ట్రాన్ని తన అనుభవంతో, మేధోశక్తితో చంద్రబాబు ముందుకు నడుపుతున్నారని చెప్పారు. జన్మభూమిలో భాగంగా పేదలకు పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల మంజూరు చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని ఫిషింగ్ హార్బర్‌ను రూ.40 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించగల సత్తా చంద్రబాబుకే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, ఎపిఇపిడిసిఎల్ అధికారి ఎంఎం.నాయక్, జివిఎంసి కమిషనర్ ఎం.హరినారాయణ్ తదితరులు పాల్గొన్నారు.



జన్మభూమిలో మాట్లాడుతున్న మంత్రి గంటా శ్రీనివాసరావు

9వ రోజుకు మత్స్యకారుల రిలే దీక్షలు

కలెక్టరేట్ : మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని శాంతియుతంగా నిరాహారదీక్షతో ఉద్యమిస్తున్నామని, దీనిని ప్రభుత్వం అలుసుగా తీసుకోవద్దని విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ ఫిషర్‌మెన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జెడి నాయుడు అన్నారు. మత్స్యకారులకు ఆగ్రహం వస్తే ఎలా ఉంటుందో కాకరపల్లి, గంగవరం ఉద్యమాలను పాలకులు గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. మత్స్యకారుల ఎస్‌టి సాధన సమితి ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు గురువారం నాటికి 9వ రోజుకు చేరాయి. దీక్షల్లో పాల్గొన్న జెడి.నాయుడు మాట్లాడుతూ ఏడాదిలో 365 రోజుల పాటు సముద్రంలో చేపల వేటలో ఉండే మత్స్యకారులకు రాజకీయాలతో సంబంధం ఉండదన్నారు. దీనినే పాలకులు అలుసుగా తీసుకుంటున్నారన్నారు. మత్స్యకారులకు ప్రభుత్వ రుణాలు, డీజిల్, తెప్పలు, వలల సబ్సిడీ సక్రమంగా అందటం లేదన్నారు. కాపులు ఉద్యమిస్తే వారిని బిసిల్లో చేర్చారని చెప్పారు. మత్స్యకారులను ఎస్‌టిల్లో చేరుస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో టిడిపి ఇచ్చిన హామీని ఎందుకు నెరవేర్చరని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి కన్వీనర్ మూగి శ్రీరామమూర్తి, చెన్నా దాసు, నందన్న, పిసి అప్పారావు, కదిరి అప్పారావు, కోలా గురువులు, గరికిన గౌరి (వైసిపి), మూగి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటుకు వినతి

కలెక్టరేట్ : స్వాతంత్ర్య సమరయోధులు, కేంద్రంలో 30 ఏళ్ల పాటు మంత్రి పదవులు నిర్వహించి, దళితుల అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేసిన బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని జివిఎంసి ఎదురుగా ఉన్న గాంధీ పార్కులో ఏర్పాటుచేయాలని విశాఖ సిటీ షెడ్యూల్డ్ కులాల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గంట్యాడ శంకరరావు విజ్ఞప్తి చేశారు. గురువారం నగరానికి వచ్చిన ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ కారెం శివాజీకి ఈ మేరకు వినతిపత్రం అందించారు. జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని నగరంలో ఏర్పాటుచేయాలని 2012లో జివిఎంసి కౌన్సిల్ ఆఖరి సమావేశంలో నిర్ణయించారని తెలిపారు. ఐదేళ్లు పూర్తయినా కౌన్సిల్ తీర్మానం నేటికీ అమలు కాలేదని గుర్తు చేశారు. శివాజీని కలిసిన వారిలో జె.రమేష్, కె.రాజు, వై.రాజు, బి.రవిశంకర్, జి.శాంతకుమారి ఉన్నారు.

డిసిఐపై నేడు ప్రజా బ్యాలెట్

సిఐటియు ఆలిండియా ప్రెసిడెంట్ హేమలత హాజరు

ప్రజాశక్తి-కలెక్టరేట్

లాభాల్లో నడుస్తున్న డిసిఐని ప్రయివేటీకరించాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయం సరైనదా? కాదా? అనే అంశంపై కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు చేపట్టిన "ప్రజా బ్యాలెట్" కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఎల్ఐసి డివిజినల్ ఆఫీసు భవనం వద్ద నిర్వహిస్తున్నట్లు ఎల్ఐసి ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎన్.రమణాచలం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా యూనివర్శిటీ పూర్వపు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కెవి.రమణ, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కార్యదర్శి ఎ.అజశర్మ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. జగదాంబ వద్ద చేపట్టే ప్రజా బ్యాలెట్‌లో సిఐటియు ఆలిండియా ప్రెసిడెంట్ డాక్టర్ కె.హేమలత పాల్గొంటారు.

దళితులపై దాడులకు కెవిపిఎస్ నిరసన

ప్రజాశక్తి-డాబాగార్డెన్స్

మహారాష్ట్రలోని భీమ్-కోరేగావ్‌లో దళితులపై ఆర్ఎస్ఎస్, బిజెపి చేస్తున్న దాడులను కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఖండిచింది. ఈ మేరకు డాబాగార్డెన్స్ కూడలి దరి అంబేద్కర్ విగ్రహం ఎదుట కెవిపిఎస్ ఆధ్వర్యాన గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ నగర కార్యదర్శి ఆర్‌పి.రాజు మాట్లాడుతూ, నవభారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్‌ను స్మరించుకుంటున్న సమయంలో దళితులపై హిందుత్వ సంఘాల దాడులు చేయడం దారుణమన్నారు. దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులపై దాడులు పెరిగాయని చెప్పారు. బిజెపి, దాని అనుబంధ సంఘాలైన ఆర్ఎస్ఎస్, గోసంరక్షణ దళాలు, హిందూ మతోన్మాదులు దళితులను చంపుతున్నారన్నారు. రాష్ట్రంలోని తెలుగుదేశం ప్రభుత్వం లౌకికవాదాన్ని పక్కనపెట్టి కులం, మతం పేరుతో విడదీసి పాలిస్తుందని విమర్శించారు. దళితులపై దాడులు చోటుచేసుకుంటున్నా మోడీ, చంద్రబాబు నోరుమెదపడంలేదన్నారు. కోరేగావ్ ఘటనపై సుప్రీంకోర్టు న్యాయయమూర్తిచే విచారణ జరిపి దళితులపై దాడి చేసిన వారందరిని కఠనంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దువ్వాడ సెజ్‌లో గిరిజన మూగ బాలికపై అత్యాచారం చేసిన డ్రైవర్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వై.రాజు, కె.గణేష్, జ్యోతి, సింహాచలం, సిహెచ్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కెవిపిఎస్ నాయకులు

రోడ్డు రవాణా రంగ బిల్లు ఆలోచన విరమించాలి

ప్రజాశక్తి-విశాఖపట్నం

దేశానికి వెన్నుముక అయిన రవాణారంగంపై కేంద్ర ప్రభుత్వం అన్యాయంగా ఆర్థిక భారాలను మోపుతుందని, ఎంవి యాక్ట్ సవరణ బిల్లు పేరుతో ట్రాన్స్‌పోర్టు రంగాన్ని బహుళజాతి సంస్థలకు కట్టబెట్టే కుట్రచేస్తుందని, ఈ ఆలోచనను విరమించాలని విశాఖ స్టీవ్‌డోర్, ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బి.జగన్, విశాఖమోటార్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు, విశాఖ ఆటోరిక్షా కార్మికసంఘం నగర ప్రధానకార్యదర్శి డి.అప్పలరాజు డిమాండ్‌చేశారు. ప్రభుత్వం వేసిన చలానాలు, పెనాల్టీలు, రోడ్ ట్యాక్స్, సర్వీస్ ట్యాక్స్, గ్రీన్ ట్యాక్స్, డీజిల్‌పై వ్యాట్ వంటి అనేక ఆర్థిక భారాలతో రవాణా రంగం కుదేలయిందని తెలిపారు. ఈ నెల 5వ పార్లమెంట్‌లో బిల్లుపెట్టడానికి ప్రయత్నం చేస్తున్నారని, దీనిని సిఐటియు, రవాణరంగ కార్మికులు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. ఈ బిల్లును గాని పార్లమెంట్‌లో పెడితే రాష్ట్ర వ్యాప్తంగా రవాణారంగాన్ని స్తంభింపజేస్తామని హెచ్చరించారు.

అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

కలెక్టరేట్ : గిరిజన మూగ బాలికపై అత్యాచారానికి పాల్పడిన వారిని, నేరాన్ని కప్పి పుచ్చేందుకు ప్రయత్నించిన వారినీ కఠినంగా శిక్షించాలని వైసిపి నాయకులు తైనాల విజయ్‌కుమార్, మళ్ల విజయప్రసాద్ డిమాండ్ చేశారు. వైసిపి మహిళా విభాగం ఆధ్వర్యాన గురువారం సాయంత్రం ఎల్ఐసి అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బాధిత గిరిజన బాలికకు రూ.30 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని, నిందితులపై నిర్భయ చట్టంతోపాటు, అట్రాసిటీ కేసులు బనాయించి కఠినంగా శిక్షించాలని కోరారు. తెలుగుదేశం ప్రభుత్వంతో మహిళలకు రక్షణ లేకుండాపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అనకాపల్లి పార్లమెంటు నేత వరుదు కళ్యాణి, నగర మహిళా విభాగం అధ్యక్షులు గరికిన గౌరీ, పీలా వెంకటలక్ష్మి, మళ్ల ధనలత, యువశ్రీ, మేరుగులమాల శ్రీదేవి, సమీరా బేగం, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఐఐటి జీనియస్ ఉపకార వేతనాలు


కలెక్టరేట్ : 8, 9, 10 ఇంటర్మీడియట్ వరకు టాప్ టెన్ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఐఐటి జీనియస్ టైటిల్‌తో సత్కరించనున్నట్లు ఫిట్జి సంస్థ డైరెక్టర్ ఆర్ఎల్ త్రికఫిడ్జి తెలిపారు. అంతేకాకుండా అటువంటి విద్యార్థులు ఏదైనా ఐఐటిలో చదువుకునేందుకు ఫిట్జి పూర్తి ఖర్చును భరించి ఉపకార వేతనాలను అందిస్తుందన్నారు. విద్యార్థుల్లో వుండే ప్రతిభను వెలికి తీయడమే తమ సంస్థ లక్ష్యమని చెప్పారు. ప్రతిభ ఉన్నా, ఆర్థిక స్థోమత లేక చదువును కొనసాగించలేకపోతున్నారని, అలాంటి వారికి ఐఐటి జీనియస్ రూపొందించినట్లు తెలిపారు. దేశంలో ఉండే నిజమైన మేధవులను వెలికి తీయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని చెప్పారు. విద్యార్థులకు భారత దేశమంతటా ఫిబ్రవరి 4న పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి 1 లోగా విద్యార్థులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేసేందుకు అభ్యర్థులు ఫిట్జి కామ్ ద్వారా లాగిన్ అవ్వాలన్నారు. మరిన్ని వివరాలకు IITGENIUS.COM సంప్రదించాలని సూచించారు.

లిఖితపూర్వక హామీ ఇస్తేనే దీక్షల విరమణ

స్పష్టంచేసిన మత్స్యకార నేతలు

కలెక్టరేట్ : మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్చుతున్నట్లు లిఖిత పూర్వక హామీని ప్రభుత్వం ఇస్తే తప్ప నిరాహార దీక్షలను విరమించేది లేదని మత్స్యకారుల ఎస్‌టి సాధన సమితి నాయకులు ఎస్‌వి.సుధాకర్, తెప్పల శాంతారామ్, పిసి అప్పారావు, బుద్ధ నీలకంఠం, మూగి సూర్యనారాయణ, చెన్నా దాసు, కంటుముచ్చు తాతారావు తదితరులు స్పష్టంచేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదలచేశారు. రాష్ట్ర మంత్రి గంటా శ్రీనివాసరావు బుధవారం నిరాహారీదక్ష శిబిరాన్ని సందర్శించి తమ సమస్యలపై సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. గురువారం చంద్రబాబు నగరానికి వస్తున్న సందర్భంగా ఆయన సమక్షంలో మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్చే అంశంపై హామీ ఇస్తారని చెప్పారని తెలిపారు. గతంలో కూడా ఇలాంటి హామీ ఇచ్చారని, ఇంతవరకు అమలు పరచలేదని, అందుకే స్పష్టమైన లిఖితపూర్వక హామీ ఇవ్వాలని కోరారు.

ఘనంగా 'యువ తరంగ్'


ఫ్లాష్‌మాబ్

ప్రజాశక్తి -విశాఖపట్నం

దువ్వాడలోని విజ్ఞాన్ ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలలు సంయుక్తంగా తలపెట్టిన యువతరంగ్ 2కె18 గురువారం సందడి వాతావరణం నడుమ ప్రారంభమైంది. క్రీడా, సాంస్కృతిక పోటీలు అలరించాయి. విద్యార్థుల ఫ్లాష్‌మాబ్ కట్టిపడేసింది. జాతీయతా భావాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలంటూ విద్యార్థులు చేసిన బృంద నృత్యానికి చప్పట్ల వర్షం కురిసింది. రాష్ట్రంలోని 40 కళాశాలల నుంచి 1500 మంది పాల్గొన్నారు. అలూమ్ని అవార్డు కోసం 150 మంది, పూర్వ విద్యార్థుల సమ్మేళనం కోసం 720 మంది, గ్రాడ్యుయేష్ డే కోసం 1150 మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారు. ఉత్సవాలను విజ్ఞాన్ సంస్థల సిఇఒ పవన్ కృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చల్లా నర్సింహం, ప్రొఫెసర్ శేషారావు, డాక్టర్ వై.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

క్యాంపస్ కబుర్లు


ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు


దేశభక్తి గీతానికి యువత నృత్యం

ప్రజా సమస్యలపై అలుపెరగని పోరు

సామాజిక సేవలోనూ సిపిఎం మేటి
రేపటి నుంచి అచ్యుతాపురంలో జిల్లా మహాసభలు

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం అలుపెరగని పోరాటం సాగిస్తోంది. ప్రభుత్వం ఎంత నిర్బంధాన్ని ప్రయోగించినా, అణచివేతకు పాల్పడినా, అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేసినా, ఏ మాత్రం వెనుదిరకుండా ప్రజల పక్షాన నిలబడుతుంది. ప్రజలెదుర్కొంటున్న స్థానిక సమస్యల నుంచి మోడీ, చంద్రబాబు ప్రభుత్వాలు అనుసరిస్తున్న వినాశకర విధానాలకు వరకు ప్రజా వ్యతిరేక విధానాలన్నింటిపైనా ఉద్యమిస్తుంది. కార్మిక, కర్షక, గిరిజన, దళిత, వృత్తిదారులు ఇలా అన్ని వర్గాలకు అండగా ఉంటూ వస్తోంది. భూ సమస్యలపైనా, నిర్వాసితులకు పరిహారం, ఉపాధిపైనా పోరాడుతోంది. సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో సిపిఎం ముందుంటుంది. ఈ నెల 6, 7, 8 తేదీల్లో అచ్యుతాపురంలో సిపిఎం జిల్లా మహాసభలు జరగనున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం...

భూ సమస్యలు- నిర్వాసితులు - పరిహారం- ఉపాధి..

జిల్లాలో భూ సమస్యలు, భూ సేకరణ, నిర్వాసితులకు అందాల్సిన పరిహారం, ఉపాధి వంటి అంశాలపై సిపిఎం ఉద్యమించింది. జిల్లాలో ఎస్ఇజెడ్, ఇతర పరిశ్రమలు, సంస్థల పేరుతో రైతులు, పేదల వద్ద భూములను ప్రభుత్వం లాక్కుంటున్న నేపథ్యంలో సిపిఎం జోక్యం చేసుకొని వారికి న్యాయమైన పరిహారం, ఉపాధి, ప్యాకేజీల కోసం పోరాటాలు నిర్వహించింది. నక్కపల్లి ఎస్ఇజెడ్, ఆనందపురం మండలం గంభీరం ఐఐఎం, మునగకపాక, పరవాడ, అనకాపల్లి మండలాల్లోని లాజిస్టిక్ హబ్ తదితర చోట్ల నిర్వాసితుల తరుపున పోరాడింది. లాజిస్టిక్ హబ్ నిర్వాసితులకు ఎకరాకు 13 లక్షల రూపాయలు నష్టపరిహారం అందేలా చేసింది. అచ్యుతాపురం ఎన్‌టిపిసి నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని, ఎస్ఇజెడ్, రాంబిల్లి ఎన్ఎఒబి, పరవాడ ఫార్మాసిటీ సమస్యలపైనా అలుపెరగని పోరాటం సాగించింది. సబ్బవరం మండలం, వంగలి సేకరణపై పాదయాత్రలు, ఆందోళనలు నిర్వహించింది. బుచ్చెయ్యపేట మండలం రాజాం ప్రాంతంలో ప్రభుత్వ అక్రమ భూ సేకరణపై ఉద్యమించింది. అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు అనంతగిరిలో భూ కబ్జాలపై ఆందోళన చేసి 36 మందికి తిరిగి వారి భూములను వారికి అప్పగించడం జరిగింది.

మత్స్యసంపదను నాశనం చేసి మత్స్యకారుల వృత్తిని, ఉపాధిని దెబ్బతీసే విధంగా పూడిమడక సముద్రతీరంలోకి పైప్‌లైన్ ఏర్పాటుపై సిపిఎం బాధితులకు అండగా నిలిచింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు ఆ గ్రామంలో పర్యటించి మద్దతు తెలియజేశారు. భీమిలి మండలంలోని దివీస్ లేబొరేటరీస్ కాలుష్యం నుండి ప్రజల్ని కాపాడాలని, దివీస్ విస్తరణ పనులు వెంటనే నిలుపుదల చేయాలని స్థానికులు చేసిన న్యాయమైన పోరాటంలో భాగస్వామ్యమైంది. 140 రోజుల పాటు దీక్షలు చేపట్టడంతో దివీస్ యాజమాన్యం దిగొచ్చి విస్తరణ నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. పెద్దేరు ఎడమ కాలువ నిర్మాణం చేపట్టి గిరిజన రైతులను ఆదుకోవాలని నిర్వహించిన పాదయాత్రతో ప్రభుత్వం ఆరు కోట్ల 50 లక్షలు మంజూరు చేసింది. గొలుగొండలో గిరిజనులు, దళితుల భూములను భూ స్వాములు ఆక్రమించాలని చేసిన ప్రయత్నాలను తిప్పికొట్టి గిరిజనులు, దళితుల పక్షాన సిపిఎం నిలబడింది.

బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా...

జికె.వీధి మండలం, జర్రెల బ్లాక్‌లో బాక్సైట్ తవ్వకాల కోసం 2015 నవంబర్ 5న చంద్రబాబు ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 97పై గిరిజనం బగ్గుమంది. గిరిజనుల జీవితాలను చిద్రం చేసే, నీటి వనరులను, పర్యావరణాన్ని నాశనం చేసే బాక్సైట్ తవ్వకాలను మొదటి నుంచి వ్యతిరేకిస్తూ, సమరశీల పోరాటాలు నిర్వహిస్తున్న సిపిఎం జిఒ 97ను రద్దు చేయాలని ఆందోళన ఉధృతం చేసింది. చైతన్య సమావేశాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, బహిరంగ సభలు, బంద్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేసింది. అంతే కాకుండా సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్‌తో చింతపల్లిలో భారీ బహిరంగ సభ నిర్వహించింది. గిరిజనుల పోరాటానికి ప్రభుత్వం తలవంచక తప్పలేదు. ఆ జిఒను తాత్కాలికంగా నిలుపుదల చేసింది.

కార్మిక పోరాటాలకు అండగా...

కార్మిక పోరాటాలకు సిపిఎం ఎల్లవేళలా అండగా ఉంటూ వచ్చింది. ప్రధానంగా అచ్యుతాపురం బ్రాండిక్స్ కంపెనీ కార్మికులు పిఎఫ్, జీతాలు పెంపు, ఇతర సమస్యలపై 7 వేల మంది చేసిన పోరాటానికి సంపూర్ణ సహకారం అందించింది. గ్రామాల్లో పర్యటించి కార్మికులకు ధైర్యం చెప్పి పోరాటాన్ని ఉధృతం చేయడానికి దోహదపడింది. అలాగే నర్సీపట్నం ఏరియాలో ఓలం జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికులు సుదీర్ఘకాలం నడిపిన పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొని వారిని నడిపించింది. నక్కపల్లి హెటిరో, అచ్యుతాపురం అభిజిత్‌తో పాటు సెజ్‌ల్లోని వివిధ కంపెనీల కార్మికుల పోరాటాలకు అండగా నిలబడింది.





ఏజెన్సీలోని టూరిజం కార్మికులు, హాస్టల్ వర్కర్లకు వేతన ఒప్పందం, ఇతర సమస్యలపై పోరాటం నిర్వహించి హాస్టల్ వర్కర్లకు విజయం చేకూర్చింది. స్కీమ్ వర్కర్లకు ఏ సమస్య వచ్చినా సిపిఎం స్పందిస్తోంది.

ఆదివాసీలకు తోడూ నీడ...

మన్యంలోని ఆదివాసీలకు సిపిఎం అండగా ఉంటుంది. వారి కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటూ వారి మన్ననలు పొందింది. వారు నిత్యం ఎదుర్కొనే తాగునీరు, రహదారులు, విద్యుత్, వైద్య సదుపాయాలు, ఇతర సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహిస్తుంది. వారి జీవనాన్ని ఛిద్రం చేసే ఏ చర్యనైనా సిపిఎం వ్యతిరేకిస్తూ వస్తుంది. జ్వరం వచ్చినా, జబ్బు చేసినా వారికి సిపిఎం మాత్రమే కనిపిస్తుంది. అంతగా వారి గిరిజనుల్లో మమేకమైంది. పోడు భూములకు పట్టాలివ్వాలని కోరుతూ ఏజెన్సీలో పాదయాత్రలు నిర్వహించి ఆందోళనలు చేపట్టింది.

ఉపాధి నిధులు స్వాహా, బకాయిలపై..

ఏజెన్సీ 11 మండలాలతో పాటు గొలుగొండ, చీడికాడ మండలాల్లో ఉపాధి పనులు, మరుగుదొడ్ల నిధుల్లో సుమారు రూ.16కోట్లకు పైగా అవినీతి చోటుచేసుకోగా, దానినిపై సిపిఎం ఉద్యమించింది. గ్రామాల్లో సర్వేలు నిర్వహించి అవినీతి ఎంత మొత్తంలో జరిగిందో ఆధారాలతో సహ బయటపెట్టింది. ఈ సమస్యపై ఉద్యమించి డబ్బులను కాజేసిన వారిలో 74 మందిపై చర్యలు తీసుకొనేలా చేసింది. ఉపాధి హామీ కూలీలకు చెల్లించాల్సిన బకాయిలు ఇవ్వాలని జిల్లా వ్యాప్తంగా కూలీలతో సమావేశాలు ఏర్పాటు చేసి వారిని చైతన్యం చేసి ఆందోళనలు చేసింది.

అక్రమ గ్రానైట్ తవ్వకాలపై

ఏజెన్సీలో, నాన్ షెడ్యూల్ ఏరియాలో అక్రమ మైనింగ్‌కు వ్యతిరేకంగా సిపిఎం పోరాడింది. బుచ్చెయ్యపేట మండలం రాజాం పూరకొండలో గ్రానైట్ తవ్వకాలకు ప్రభుత్వం ఇచ్చిన జిఒను రద్దు చేయాలని పోరాడింది. అనంతగిరి మండలం భీంపోలు, లువ్వా గ్రామాల్లో అక్రమ మైనింగ్‌ను రద్దు చేయాలని కోరుతూ ఆందోళన చేయడంతో పాటు ఆ ప్రాంతంలో పర్యటనకు వచ్చిన మైనింగ్ మాఫియా, అధికారులను స్థానికులతో కలిసి అడ్డుకోవడం జరిగింది.

సుగర్ ఫ్యాక్టరీ సమస్యలపై...

జిల్లాలోని సుగర్ ఫ్యాక్టరీల సమస్యలపై సిపిఎం పోరాడింది. చోడవరం మండలం గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో రూ.8 కోట్ల అవినీతి ఆరోపణలపై విచారణ జరపాలని, రైతులకు బకాయిలు చెల్లించాలని ఆందోళనలు నిర్వహించింది. అలాగే తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని మూసివేయడాన్ని, దానిని విశాఖ డెయిరీకి అప్పగించాలని ప్రజా ప్రతినిధుల ఆలోచనను వ్యతిరేకిస్తూ పోరాటం చేసింది.

వివిధ సమస్యలపై పాదయాత్రలు

జిల్లాలోని తీరం, గిరిజన, నాన్‌షెడ్యూల్డ్ ఏరియాలతో పాటు ఇతర గ్రామీణ ప్రాంతాల్లోని 27 మండలాల్లో సిపిఎం పాదయాత్రలు నిర్వహించి ప్రజల సమస్యలను తెలుసుకోవడం జరిగింది. రైవాడ రైతులకు నీరు ఇవ్వాలని రాస్తారోకోలతో పాటు అక్కడి రైతులు, వివిధ సంఘాలను కలుపుకొని పాదయాత్ర నిర్వహించింది. కాఫీ రైతుల బకాయిలు, ప్రోత్సాహక నిధులు, అటవీ భూములకు పట్టాలు, రేషన్ కార్డులు, ఇళ్ల బకాయిలు, గృహాలు మంజూరు, రోడ్లు, మరుగుదొడ్ల వంటి సమస్యలపై ఈ యాత్రలు నిర్వహించారు. గిరిజన ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న నాన్‌షెడ్యూల్డ్ ఏరియాలోని భూ సమస్యలు, అర్హులకు భూపట్టాలు, గ్రానైట్ తవ్వకాల అక్రమాలపైనా పాదయాత్రలు చేసింది.

ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదుర్కొంటూ..

ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదుర్కొంటూనే సిపిఎం పోరును సాగించింది. ముఖ్యమంత్రి జిల్లా పర్యటనలో సమయంలో జిల్లాలో జరిగిన ప్రధాన సమస్యలపై ఉద్యమాలు చేసే సందర్భాల్లో సిపిఎం నాయకులను గృహనిర్బంధం చేసి అర్ధరాత్రి అరెస్టులు చేసి స్టేషన్లో వుంచారు. మహిళలను కూడా ముందస్తు అరెస్టు చేసి స్టేషన్లో వుంచిన ఘటనలో అనేకం జరిగాయి. ఏజెన్సీలోనూ, గ్రామీణంలోనూ మూడేళ్ల కాలంలో 1,106 మంది సిపిఎం కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు.

సామాజిక సేవలో..

సిపిఎం ప్రజా సంఘాల నేతృత్వంలో ఇటీవల కాలంలో సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి ప్రజల అభిమానాన్ని పొందింది. విశాఖ ఏజెన్సీలో ప్రతి ఏటా ఎపిడిమిక్ సీజన్‌లో గిరిజనులు వివిధ రోగాలకు గురై మృత్యువాత పడుతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో సిపిఎం చొరవ, సహాయంతో గిరిజన సంఘం, జనవిజ్ఞాన వేదిక వంటి సంఘాల ఆధ్వర్యాన విస్తృతంగా వైద్య శిబిరాలు నిర్వహించి లక్షలాది రూపాయల విలువల చేసే ఖరీదైన మందులను పంపిణీ చేయడం జరిగింది. నడిచి వెళ్లడానికి వీల్లేని గ్రామాలకు గుర్రాలపై వైద్యులను, మందులు తీసుకెళ్లి గిరిజనులకు వైద్యాన్ని అందించిన ఘనత సిపిఎంకే దక్కుతుంది. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో గజ్జితో బాధపడుతుంటే సిపిఎం సహాయంతో గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ సంఘాల కార్యకర్తలు 30వేల మంది విద్యార్థులకు గజ్జి మందును పూసి సేవలందించారు. ఏజెన్సీలోని సుదూర ప్రాంతాల నుంచి పిహెచ్‌సిలకు వచ్చే రోగులు, వారి బంధువులకు భోజనాలు లేక ఇబ్బంది పడుతుంటే సిపిఎం సహకారంతోనే గిరిజన సంఘం ఏజెన్సీలోని పిహెచ్‌సిల వల్ల ఉచిత భోజన కేంద్రాలు నడిపి భోజనాలు అందించింది. పలు మండలాల్లో గిరిజనులు ఆంత్రాక్స్ బారినపడితే వారికి మెరుగైన వైద్య సేవాల కోసం కృషి చేయడంతో పాటు, వారి కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసింది. చలితో బాధపడుతూ, చదువులు కొనసాగించలేకపోతున్న విద్యార్థులకు రగ్గులు ఉచితంగా పంపిణీ చేసింది. తోగు మంచినీటి సౌకర్యం కోసం గ్రావిటీ వాటర్ పథకాన్ని కొనసాగిస్తోంది.

వ్యాధులు తీవ్రంగా ప్రబలే గ్రామాల్లో సిపిఎం కార్యకర్తలు శ్రమదానం విస్తృతంగా నిర్వహించారు. చదువుకున్న గిరిజన నిరుద్యోగులకు పాడేరు, అరకు, స్టీల్‌ప్లాంట్, యూనివర్సిటీల్లో నైపుణ్యం కల్గిన వారితో ఉచిత శిక్షణ ఇప్పించింది. దేశంలో ఎక్కడ ప్రకృతి వైపరీత్యాలు చోటుచేసుకున్నా అక్కడి బాధితుల సహాయార్థం విరాళాలు వసూలు చేసి వారికి పంపించడం జరిగింది.

వహ్వా.. ఏమిటీ

సిటీ స్పెషల్


బీచ్ రోడ్డులో టీ అమ్ముతున్న యువకుడు

- వణికించే చలిలో టీ స్టాల్స్‌కు పెరుగుతున్న గిరాకీ
- గ్రీన్, లెమన్ రకాలకు జై కొడుతున్న తేనీటి ప్రియులు
- నగరంలో ఎక్కడికక్కడ వెలుస్తున్న దుకాణాలు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

రాజైనా, బంటైనా, ధనికుడైనా, పేదోడైనా, యువకుడైనా, వృద్ధుడైనా ఉదయాన్నే నిద్ర లేవగానే వేడివేడి చాయ్ గొంతులో పడాల్సిందే. మన దేశంలో చాలా మందికి ఉదయం నిద్ర లేవగానే టీ తాగడం నిత్యకత్యంగా మారింది. చలికాలంలో వేడివేడి తేనీరు సేవిస్తే ఆ మజానే వేరు. కొందరు రోజుకు నాలుగైదు సార్లు తేనీరు సేవిస్తుంటారు. విశాఖ సిటీలో ప్రస్తుతం ఎక్కడ చూసినా నూతన రకాల టీ దుకాణాలు వెలుస్తున్నాయి. ముఖ్యంగా బీచ్ రోడ్డులో ఈ దుకాణాల సంఖ్య వేలల్లో ఉంటుందంటే అతిశయోక్తి కాదు. తెల్లవారుజామున వాకింగ్, రన్నింగ్‌లకు వెళ్లే వారితో ఈ దుకాణాలు నిత్యం కలకళలాడుతుంటాయి. ఇవి కాకుండా నగరం మధ్యలో కూడా వేలాది దుకాణాలు వెలిశాయి.

ఆర్థిక రాజధానిగా గుర్తింపు పొందుతున్న విశాఖలో టీ వ్యాపారం జోరందుకుంటోంది. టీ స్టాల్స్‌లో కొత్త రుచులను అందిస్తున్నారు. ఇప్పటి వరకూ బాయిలర్ టీ, డికాక్షన్ టీ, స్పెషల్ టీలకే వ్యాపారం పరిమితమైంది. ఈ మధ్య కాలంలో గ్రీన్ టీ, లెమన్ టీ, పెప్పర్ టీ, రోజ్ టీ, ఇరానీ టీ, శాంతి టీ, అల్లం టీ, బాదం టీ, హెర్బల్ టీ, హనీ టీ, వైట్ టీ, షుగర్లెస్ టీ ఇలా పదుల సంఖ్యలో తేనీటి వెరైటీలను వ్యాపారులు అందుబాటులోకి తెస్తున్నారు. వివిధ రకాల టీలను అందించేందుకు టీ లాంజ్లు కూడా అందుబాటులోకి వచ్చాయి. ఛాయ్‌కు ప్రతి సీజన్లో గిరాకీనేకానీ చలికాలంలో అది రెట్టింపు అవుతుందని వ్యాపారులు చెబుతున్నారు. సిటీ పరిధిలో సుమారు పది వేలకుపైగా టీ షాపులున్నాయంటే ఆశ్చర్యపోవాల్సిందే.

గ్రీన్, లెమన్ టీలకు గిరాకీ

టీ స్టాల్స్‌కు వచ్చే చాలా మంది గ్రీన్, లెమన్ టీలను ఎక్కువగా సేవిస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ ఉన్నవారికి ఇది ప్రత్యేకం అనే అభిప్రాయం ఉంది. సన్నగా అవ్వాలనుకునేవారు, గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు గ్రీన్ టీనే ప్రిఫర్ చేస్తున్నారు. ప్రత్యేక లాంజ్లలో,



మొబైల్ ప్యాంట్రీల్లో గ్రీన్ టీలో 16 రకాలు అందుబాటులో ఉన్నాయి. బ్లాక్ టీ, పుదీనా టీ, ఫ్లేవర్డ్ టీ, ఎల్లో టీ, వైట్ టీ, చాక్లెట్ టీ, స్పెషల్ టీ, ఐస్ టీ వంటి అనేక రకాలు లభిస్తున్నాయి. వీటి కోసం అస్సాం, నీలగిరీస్, డార్జిలింగ్ వంటి ప్రాంతాలతోపాటు డ్రాగన్ దేశాలైన చైనా, జపాన్ నుంచి కూడా తేయాకు తెప్పిస్తున్నారంటే వాటి ప్రాధాన్యతను అర్థం చేసుకోవచ్చు. ఇందులో ఎటువంటి ఇతర పదార్థాలూ కలపకుండా ముడి (రా) టీని సైతం అందుబాటులోకి తెస్తున్నారు. లేలేత టీ ఆకులకు కాస్త వేడి నీటిని చేర్చి చేతికందించే లాంజ్లలో రకరకాల రుచులే కాదు, ధరలూ అదే స్థాయిలో ఉంటున్నాయి. మొత్తంగా విశాఖ నగరంలో టీ వ్యాపారం తోపాటు, తేయాకు విక్రయాలు రోజుకు రూ.కోటి మించి ఉంటుందని వ్యాపారస్తులు చెబుతున్నారు.



నగరంలో నోరూరించే టీ రకాలు

అస్సాం నుంచి విశాఖకు దిగుమతి

ఐదు వేల సంవత్సరాల క్రితం చైనాలో పుట్టిన తేయాకు యూరప్, అమెరికాల మీదుగా ఈస్ట్ ఇండియా కంపెనీ ద్వారా ఇండియాలోకి అడుగుపెట్టిందని చరిత్ర ఆధారాలు చెబుతున్నాయి. మన దేశంలో పాపుగిరి, అస్సాం, మైసూర్, తమిళనాడు తదితర ప్రాంతాల్లో తేయాకు పంటలు కనిపిస్తాయి. అస్సాం ప్రపంచంలోనే అత్యధికంగా తేయాకు పండించే ప్రాంతం. ఇతర దేశాలకు టీ పొడి ఉత్పత్తుల ఎగుమతిలో చైనాది తొలి స్థానంకాగా మన దేశంలోని అస్సాం రెండో స్థానాన్ని ఆక్రమించింది. విశాఖకు కూడా అస్సాం నుంచే ముడి సరుకును దిగుమతి చేసుకుంటున్నారు.

ఎక్కువ టీ అనర్థమే

పరిమితికి మించి టీ తాగితే ఆరోగ్య సమస్యలు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గ్రీన్ టీ, హెర్బల్ టీ శరీరంలో ఉష్ణోగ్రతలను అదుపులో ఉంచుతాయని, కొవ్వును కరిగిస్తాయని ప్రచారం ఉండటం వల్ల ఈ మధ్య కాలంలో వీటి సేవనం అధికమైందని సర్వేలు చెబుతున్నాయి. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు కాయగూరల్లోనూ దొరకవు. అయితే, ఇతర టీలతో పోల్చితే గ్రీన్ టీలో కెఫిన్ తక్కువగా ఉన్నా అది మోతాదు మించితే ప్రమాదం అంటున్నారు నిపుణులు. ఇతర టీల విషయానికి వస్తే శరీరంలోకి కెఫిన్ అధికంగా వెళితే బాడీలో చిరాకు పెరుగుతుంది. ఎముకల్లోని కాల్షియాన్ని మూత్రం ద్వారా బయటకు పంపిస్తుంది. వీటిలోని యాక్సలైట్ అనే యాసిడ్లు కాలేయంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. కంటిలోని గ్లకోమాపై ఒత్తిడి పెంచి నిద్రను దూరం చేస్తాయి. ప్రత్యేక టీలో రంగు కోసం కలిపే పొడుల్లో అధికంగా ఉండే టానిస్ అనే రసాయనాలు శరీరంపై దురదను కలిగింపచేస్తాయని అధ్యయనాలు చెబుతున్నాయి. గర్భిణులు తేనీరుకు వీలైనంత వరకు దూరంగా ఉండటమే మంచిదని వైద్య రంగం విశ్లేషణ. గ్రీన్ టీ విషయంలో తయారీ కంపెనీలు సూచిస్తున్న రికమండెడ్ డోస్ రోజుకు మూడు కప్పులు మాత్రమే. కానీ చాలా మంది ఎక్కువ సార్లు గ్రీన్ టీ తీసుకుంటున్నారు. దీని వల్ల శరీరానికి నష్టం జరిగే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



'తుమ్మిడి'లో సంక్రాంతి ఆఫర్లు


కొనుగోలుదారులతో కళకళలాడుతున్న షోరూం

ప్రజాశక్తి-మద్దిలపాలెం

నగరంలోని తుమ్మిడి బ్రదర్స్ షోరూంలో సంక్రాంతి సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు అందిస్తున్నామని ఎమ్‌డి బాబీ గురువారం తెలిపారు. వస్త్ర ప్రపంచంలో సరికొత్త డిజైన్ల శారీలు, చుడీదార్లు, పిల్లలు, మెన్స్‌వేర్ దుస్తులను అందుబాటు ధరలకు అందిస్తూ అన్ని వర్గాల వారికీ నగరంలో చేరువయ్యామన్నారు. రాజమండ్రిలో 60 ఏళ్ళుగా వస్త్ర వ్యాపారంలో ఉన్నతంగా నిలిచినట్లు తెలిపారు. విశాఖ నగరంలో తొమ్మిదేళ్ళుగా నమ్మకమైన, నాణ్యమైన, మన్నికైన దుస్తులను అందిస్తూ ఉత్తరాంధ్ర కస్టమర్ల మన్ననలు అందుకుంటున్నామని చెప్పారు. వినియోగదారులు మెచ్చే అన్ని రకాల దుస్తులనూ తమ షోరూంలో అన్ని వేళలా అందుబాటులో ఉంచామన్నారు. సంక్రాంతి సందర్భంగా మహిళలకు కంచి, ఉప్పాడ చీరలపై ఒకటి కొంటే ఒకటి ఫ్రీగా అందిస్తున్నామని వెల్లడించారు. మెన్స్‌వేర్‌లో రేమండ్స్, రీడ్ అండ్ టైలర్, అరవింద్ కాటన్ షర్టింగ్స్‌పై ఒకటి కొంటే రెండు ఉచితంగా పొందే ఆఫర్లను పెట్టామన్నారు. మహిళల చుడీదార్స్, మెన్స్‌వేర్, రెడీమేడ్ దుస్తులను 1+1 ఆఫర్లకే అందిస్తున్నామని తెలిపారు.

సరికొత్త గోల్డ్ స్కీం



మా బంగారు ఆభరణాల దుకాణంలో కొత్త గోల్డ్ స్కీంను ప్రవేశపెట్టాం. వినియోగదారులు 12 నెలలు పాటు వాయిదాలు చెల్లిస్తే వారికి ఒకటిన్నర నెలల బోనస్ అందజేస్తున్నాం. ఈ స్కీంలో నెలకు కనీసం వెయ్యి రూపాయలు చొప్పున కట్టాలి. స్కీంలో ఉన్న వారికి కేవలం బంగారం రేటుకే ఆభరణాలను సులభంగా పొందే అవకాశముంది. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఆధునికీకరించిన మా షోరూంలో బంగారు ప్లెయిన్ ఆభరణాలను 6, రాళ్ళతో చేసిన ఆభరణాలను 8 శాతం తక్కువ తరుగుకే పొందే అవకాశం ఉంది. వెండి వస్తువులను తరుగు, మజూరులు లేకుండా వినియోగదారులకు అందిస్తున్నాం. ఈ అవకాశాన్ని వినియోగదారులు అందిపుచ్చుకోవాలి.

బాబీ, ఎమ్‌డి, తుమ్మిడి బ్రదర్స్ షోరూం

బిజినెస్



ఆరేళ్ల వారంటీతో టాటా మోటార్స్ వాహనాలు

ప్రజాశక్తి-డాబాగార్డెన్స్

అన్ని రకాల ట్రాక్టర్లు, ట్రయిలర్లు, మల్టీ అక్సిల్ ట్రక్కు, టిప్పర్లుపై ఆరేళ్ల వారంటీ ఇస్తున్నట్లు టాటా మోటార్స్ విశాఖ కమిర్షియల్ వెహికల్ హెడ్ గిరీష్ వాఘ్ తెలిపారు. ఈ వారంటీ విశాఖలోని టాటా అవుట్‌లెట్లతోపాటు దేశంలోని 1800 టచ్ పాయింట్లలో అందుబాటులో ఉంటుందన్నారు. ప్రతి 50 కిలోమీటర్లకు ఒక టచ్ పాయింట్ నేడు ఉందని తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో గురువారం టాటా డీలర్లలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకవేళ వెహికల్‌ను విక్రయిస్తే కండిషన్ చెక్ చేసి కొనుగోలుదారుడికి ఈ వారంటీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కస్టమర్ కేర్ యాప్ ద్వారా సర్వీసు బుకింగ్, నిర్వహణ టిప్స్, డీలర్ లొకేషన్, సర్వీసు హిస్టరీ, ఎమర్జన్సీ, ఎస్ఒఎస్ సేవలను ఉపయోగించుకోవచ్చన్నారు. టాటా సురక్ష పథకం ద్వారా ఏడాది కాలం వాహన మరమ్మతుల సౌకర్యం వినియోగదారులకు అందుబాటులో ఉందన్నారు.

సొంతింటి కల సాకారమయ్యేనా..?

- ఉత్తర నియోజకవర్గంలో స్థలాభావ సమస్య - 'హౌసింగ్ ఫర్ ఆల్' పథక లబ్ధిదారులకు తప్పని నిరీక్షణ

ప్రజాశక్తి-సీతమ్మధార

పేద, మధ్య తరగతి ప్రజల సొంతింటి కలను నిజం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రవేశ పెట్టిన హౌసింగ్ ఫర్ ఆల్ పథకంపై లబ్ధిదారుల కొండంత ఆశతో 18 నెలలుగా ఎదురు చూస్తున్నారు. సొంతింటి కల నిజమవుతుందని లేక కలగానే మిగిలిపోనుందా అన్న అనుమానాలు ప్రస్తుతం నెలకొన్నాయి.

ఉత్తర నియోజకవర్గం పరిధిలో హౌసింగ్ ఫర్ ఆల్ పథకం కింద సొంతింటి కోసం దాదాపు 32 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. వాటిని స్వీకరించి ఏడాదిన్నర గడుస్తున్నా నేటికీ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన స్థలం ఎంపిక జరగలేదు. దీంతో సొంతింటిని పొందాలన్న ఆశావహులు నిరీక్షించక తప్పడం లేదు. నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణానికి స్థల సమస్య ప్రధాన అడ్డంకిగా మారింది. స్థలాభావం కారణంగా లబ్ధిదారులకు జి ప్లస్-5, జి ప్లస్ 6 తరహాలో ఇళ్లు నిర్మించాలని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అధికారులకు సూచించారు. ఈ లెక్కన 32 వేల ఇళ్ల నిర్మాణానికి సుమారు 25 నుంచి 30 ఎకరాల స్థలం కావాల్సి ఉంది. నియోజకవర్గం పరిధిలో కేవలం 3 వేల ఇళ్ల నిర్మాణానికి సరిపడా స్థలం మాత్రమే ఉంది. 34వ వార్డు ఎఎస్ఆర్ నగర్‌లో సుమారు ఎకరా, 38వ వార్డు బర్మాకాలనీలో ఎకరన్నర, బర్మా క్యాంపస్‌లో వెయ్యి గజాల స్థలం ఉన్నట్లు గుర్తించారు. ఈ స్థలాల్లో మూడు వేల వరకూ ఇళ్లు నిర్మించాలని యోచిస్తున్నారు. మిగిలిన వారికి ఇళ్లు ఎక్కడ నిర్మించాలోనని అటు అధికారులు, ఇటు ప్రజా ప్రతినిధులు తలలు పట్టుకునే పరిస్థితి ఏర్పడింది.

ఇళ్ల స్థలాన్ని గుర్తించడానికి ఇటీవల రాష్ట్ర మంత్రులు నారాయణ, గంటా శ్రీనివాసరావు, నగర ఎమ్మెల్యేలు గాజువాక, మధురవాడ, మంగళపాలెం, చినముషిడివాడ, ఎండాడ, చినగదిలి ప్రాంతాల్లో భూములను పరిశీలించారు. నియోజకవర్గ పరిధిలో కాకుండా వేరే నియోజకవర్గంలో ఇళ్లు నిర్మించి ఇస్తే ఓట్లు తరలిపోతాయన్న ఆలోచనను ఎమ్మెల్యే ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో వ్యక్తం చేశారు. మేం కష్టపడి ఇళ్లు మంజూరు చేస్తే వేరే నియోజకవర్గంలో ఓట్లేస్తారా అని ఎమ్మెల్యే ప్రస్తావించడం విశేషం. ఇతర నియోజకవర్గాలకు లబ్ధిదారులు తరలి వెళ్లడానికి అనాసక్తి చూపిస్తుండటంతో ఉత్తర నియోజక వర్గంలోనే ఇళ్లు నిర్మించేందుకు సాధాసాధ్యాలపై కసరత్తు చేస్తున్నారు. 38, 39 వార్డులను ఆనుకొని ఉన్న సింహాచలం భూములను హౌసింగ్ కోసం తీసుకొని దానికి ప్రత్యామ్నాయంగా రెవెన్యూ భూములను ఇప్పించేందుకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారు. ప్రస్తుతం సింహాచలం భూములు కోర్టు పరిధిలో ఉన్నందున వాటిని అంత సులువు కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్య మంత్రి, దేవాదాయ శాఖా మంత్రి రాష్ట్ర మంత్రులు చొరవ తీసుకొని ఈ ఉత్తర నియోజకవర్గంలోనే హౌసింగ్ పథకం ఒక కొలిక్కి తీసుకొని వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



స్థల పరిశీలనలో ప్రజాప్రతినిధులు, అధికారులు(ఫైల్‌ఫొటో)

ఉపాధి పోతుంది..

20 ఏళ్లుగా మధురానగర్‌లో నివాస ముంటున్నాం. బడ్డీ వ్యాపారమే మాకు జీవనాధారం. మాకు వేరే ప్రాంతంలో ఇంటిని కేటాయిస్తే ఉపాధి పోతుంది.

- కె సునీత, మధురానగర్ వాసి

30 ఏళ్లుగా ఇక్కడే..

అక్కయ్యపాలెం జగ్గారావు బ్రిడ్జి వద్ద 30 ఏళ్లుగా తోపుడు బండిపై వ్యాపారం సాగిస్తున్నాం. వేరే ప్రాంతంలో ఇళ్లిస్తే మేమెలా బతకాలి

- మహాలక్ష్మి
తోపుడు బండి వ్యాపారం

అందరికీ ఇళ్లిస్తాం..

2022 నాటికి అందరికీ ఇళ్లుండాలనేదే ప్రధాన మంత్రి హౌసింగ్ ఫర్ ఆల్ పథక లక్ష్యం. ఉత్తర నియోజకవర్గంలో సుమారు 32 వేల మంది దరఖాస్తు చేస్తే 16 వేల మందిని ఎంపికయ్యారు. వారికి ఇళ్లు నిర్మించడానికి నియోజకవర్గంలో సరిపడా స్థలం లేదు. రైల్వే, పోర్టు, సింహాచలం భూములు మాత్రమే ఉన్నాయి. 3 నుంచి 4 ఎకరాల స్థలం మాత్రమే అందుబాటులో ఉంది. మధురవాడ, గాజువాక ప్రాంతాల్లో లబ్ధిదారులకు పారదర్శకతతో ఇళ్లను కేటాయిస్తాం. సింహాచలం భూ సమస్య కొలిక్కి వస్తే పరిష్కారముంటుంది.

- విష్ణుకుమార్ రాజు
ఎమ్మెల్యే, ఉత్తర నియోజకవర్గం



సమావేశమైన పెన్షనర్లు

23న పెన్షనర్ల ధర్నా

ప్రజాశక్తి-మాధవధార

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న పిఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. ఈ మేరకు గురువారం సంఘం అధ్యక్షుడు వై కృష్ణారావు అధ్యక్షతన ఎన్ఎడి కొత్తరోడ్డులోని హష్మీభవన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంస్థ నాయకులు మాట్లాడుతూ నానాటికీ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం మరింత జటిలం చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ఇపిఎఫ్ 95 పెన్షనర్ల సదస్సును ఢిల్లీలో మార్చి 7, 8 తేదీలలో నిర్వహించనున్నామనీ, సంఘం నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ పిలుపుతో ఈ నెల 23న పిఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నామనీ తెలిపారు. కార్యక్రమాల్లో పెన్షనర్లు పెద్ద ఎత్తున పాల్గని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సంస్థ ప్రధాన కార్యదర్శి సుధాకరరావు, గౌరవాధ్యక్షుడు బిటి మూర్తి, గౌరవ సలహాదారు కెబిఆర్ ప్రసాద్, ఉపాధ్యక్షుడు కనకేశ్వరరావు, కోటేశ్వరరావులతో కూడిన సభ్యులు ప్రకటన విడుదల చేశారు.

హరిప్రసాద్ సేవలు ఆదర్శప్రాయం

కంచరపాలెం : ప్రజల ఆరోగ్యమే పరమావధిగా వైద్య సేవలందించిన డాక్టర్ హరిప్రసాద్ ఆదర్శప్రాయుడని 36వ వార్డు మాజీ కార్పొరేటర్ బట్టా ఈశ్వరమ్మ అన్నారు. డాక్టర్ హరిప్రసాద్ ప్రథమ వర్థంతి సందర్భంగా కంచరపాలెంలోని సిఐటియు కార్యాలయంలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈశ్వరమ్మ మాట్లాడుతూ డాక్టర్ హరిప్రసాద్ మరణం పేద ప్రజలకు తీరని లోటన్నారు. ఆయన మొట్టమొదటిగా వైద్య వృత్తిలోకి ప్రవేశించిన తొలినాళ్లలో కంచరపాలెం ప్రాంతంలో దుర్గానగర్‌లో హాస్పిటల్ నిర్వహించారన్నారు. రూ.2 నామమాత్రపు ఫీజుతో పేదలకు వైద్యసేవలందించే వారని కొనియాడారు. ఫీజు లేని వారికి ఉచిత వైద్యాన్ని అందించే వారన్నారు. ఆయన అందించిన సేవలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ అప్పలరాజు, పి రామారావు, ఎన్ సింహాచలం, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



హరిప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఐటిఐ కళాశాలలో శిక్షణ అభినందనీయం

కంచరపాలెం : స్థానిక కంచరపాలెం ఐటిఐ కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న శిక్షణపై లేబర్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్, ఫ్యాక్టరీస్ డిపార్ట్‌మెంట్ గౌరవ ప్రత్యేక కార్యదర్శి నీరభ్‌కుమార్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం కళాశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న శిక్షణను గురించి అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో మారుతి సుజుకి, టయోటా కిర్లోస్కర్, శాంసంగ్ ట్రయినింగ్ సెంటర్లను సందర్శించి శిక్షణ పొందుతున్న విద్యార్థులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఇన్‌చార్జి ఆర్‌వి రమణ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ట్రైనింగ్ బి కూర్మారావు, రీజనల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సిహెచ్ ఉమాదేవి, డిప్యూటీ డైరెక్టర్ జాబ్ డెవలప్‌మెంట్ డి మంజుల, వైస్ ప్రిన్సిపల్ ఎల్ గౌరిమణి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సిఎం రిలీఫ్ ఫండ్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారంతా సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అన్నారు. జివిఎంసి 31, 32 వార్డులకు అక్కయ్యపాలెం షాదీఖానాలో గురువారం నిర్వహించిన 'జన్మభూమి-మా ఊరు' కార్యక్రమంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుపేదల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. చంద్రన్న బీమా పథకంతో మరణించిన వ్యక్తుల కుటుంబాలకు ప్రభుత్వాలు ఆర్థిక సాయం అందిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ జనధన్ బ్యాంకు ఖాతా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్య రక్షణ పథకంలో కూడా అందరూ నమోదు చేసుకోవాలని సూచించారు. దీని ద్వారా ప్రతి మనిషి రూ.2 లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయాలు పొందొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి అదనపు కమిషనర్ మూర్తి, జోనల్ కమిషనర్ రమణమూర్తి, ఇఇ నరసింహరావు, సూపరింటెండెంట్ ఇంజినీర్ వినయ్‌కుమార్, టిడిపి, బిజెపి వార్డు అధ్యక్షులు బడ్డేటి మోహన్, మెకాని సత్తిబాబు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

37వ వార్డులో జన్మభూమి

మాధవధార : జివిఎంసి 37వ వార్డు బాపూజీనగర్ గ్రామం కమ్యూనిటీ హాల్‌లో 'జన్మభూమి - మన ఊరు' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి వార్డు టిడిపి అధ్యక్షుడు, జన్మభూమి కమిటీ సభ్యుడు గంకల అప్పారావు అధ్యక్షత వహించారు. సభకు విచ్చేసిన ప్రజలతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం రామకృష్ణ జన్మభూమి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గంకల అప్పారావు మాట్లాడుతూ స్వచ్ఛభారత్‌ను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జన్మభూమి కమిటీ సభ్యులు, జివిఎంసి సిబ్బంది, డ్వాక్రా మహిళలు, అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

సెక్షన్ 498ఎ సవరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ

కంచరపాలెం : మహిళలపై అనేక రూపాల్లో పెరుగుతున్న హింసను అరికట్టాల్సింది పోయి వారికి రక్షణగా ఉన్న చట్టాలను నిర్వీర్యం చేయాలనుకోవడం దుర్మార్గమని ఐద్వా నగర కార్యదర్శి బి పద్మ అన్నారు. 498ఎ సెక్షన్‌కు సవరణలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ కంచరపాలెం జోన్ ఐద్వా ఆధ్వర్యాన గురువారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాళ్ల పారాణి ఆరకముందే ఎంతో మంది మహిళలు వరకట్న వేధింపులకు గురవుతున్నారన్నారు. అటువంటి వారికి రక్షణగా నిలుస్తున్న 498 ఎ చట్టాన్ని సవరించడానికి కేంద్ర ప్రభుత్వం పూనుకోవడం సరికాదన్నారు. వరకట్నం, కుటుంబ హింసలను కట్టడి చేయడానికి ఉపయోగపడే 498 చట్టాన్ని సవరిస్తే మహిళలపై మరింత హింస ప్రజ్వరిల్లుతుందన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రజలంతా ముక్తకంఠంతో ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి 36వ వార్డు మాజీ కార్పొరేటర్ బట్టా ఈశ్వరమ్మ, అనురాధ, పుష్పాంజలి సాహు తదితరులు పాల్గొన్నారు.



సంతకాల సేకరణలో ఐద్వా నాయకులు



చంద్రన్న కానుకల కోసం క్యూలో ప్రజలు

అందని 'చంద్రన్న కానుక'

సీతమ్మధార : రేషన్ సరుకులు కోసం సీతంపేట, గొల్ల వీధి, రెల్లి వీధిలో గురువారం జనం క్యూ కట్టడంతో రేషన్ డిపోలు జనసందోహంగా మారాయి. సంక్రాంతిని పురస్కరించుకుని రేషన్ సరుకులు అన్నీ ఇస్తారని ప్రజలు పెద్ద ఎత్తున చేరుకున్నారు. అయితే కేవలం బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేయడంతో వారంతా నిరాశగా వెనుదిరిగారు. చంద్రన్న సంక్రాంతి కానుకల పేరిట ఇస్తున్న ఆరు రకాల సరుకులు పలు చోట్ల లబ్ధిదారులకు అందడం లేదన్న వాదనకు గురువారం స్థానిక పరిస్థితులు అద్దం పట్టాయి.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ట్రస్టు చైర్మన్ మురళి

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

సీతమ్మధార: ఉషోదయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం అబిద్‌నగర్‌లోని సంస్థ కార్యాలయంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ట్రస్టు అధ్యక్షులు కొయిలాడ మురళి మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉండాలని, సంక్రాంతి పండగ అందరూ ఆనందంగా చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు కన్వీనర్ కొయిలాడ నవ్య, ఎం వీరాస్వామి, కోరిబిల్లి లక్ష్మణ్, కర్రి ఉమ, కె నాగమణి, యాక్మిన్ బేగం తదితరులు పాల్గొన్నారు.

శుక్రవారం 5 జనవరి 2018

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

గోపాలపట్నం : సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే గణబాబు గురువారం లబ్ధిదారులకు అందజేశారు. జివిఎంసి 68వ వార్డు లక్ష్మీనగర్‌కు చెందిన మెల్లేటి శ్రీనివాసరావు, ఇందిరానగర్‌కు చెందిన రెడ్డి సింహాచలం అనారోగ్యంతో మృతి చెందారు. వీరిరువురి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గణబాబు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.1.60 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బాధిత కుటుంబాన్ని తెలుగుదేశం ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ వార్డు అధ్యక్షుడు నారిపిన్ని సత్తిరాజు, తెలుగుదేశం పార్టీ నగర కార్యదర్శి కెవి బాల సుబ్రహ్మణ్యం, జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పిడుగు మంగలక్ష్మి పాల్గొన్నారు.

'పేదలకు అండ చంద్రన్న బీమా'

గోపాలపట్నం : జివిఎంసి 66వ వార్డు వెంకటాపురంలో ఇటీవల మృతిచెందిన నీలాపు ప్రసాద్, అలాగే కొండవలస సింహాచలం కుటుంబ సభ్యులకు తెలుగుదేశం పార్టీ నాయకులు నందవరపు సోములు, బొడ్డేటి విజయ్‌కుమార్ బీమా అధికారి సంయుక్తంగా చంద్రన్న బీమాను అందజేశారు. ఈ సందర్భంగా సోములు మాట్లాడుతూ చంద్రన్న బీమా వల్ల పేద, మధ్య తరగతి ప్రజలు ఎంతో లబ్ధి పొందుతున్నారని చెప్పారు. దేశంలో ఎక్కడ అమలు కానటువంటి బీమాను మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అయితంశెట్టి గోపి, దాడి సురేష్, బల్ల రమణ, కంపర రాజ్యలక్ష్మీ, పద్మావతి, బీమామిత్ర రాధ పాల్గొన్నారు.



చంద్రన్న బీమా అందజేస్తున్న టిడిపి నేతలు

సంక్షేమ పథకాలతో పేదల అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి-మల్కాపురం

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా పేదల అభివృద్ధి సాధ్యపడుతుందని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. ఈ మేరకు జివిఎంసి 49వ వార్డు పరిధి మల్కాపురం త్రినాథపురం జంక్షన్ వద్ద జన్మభూమి - మా ఊరు కార్యక్రమాన్ని వార్డు టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు మజ్జి సోమేష్, డొంప సన్యాసిరావుల ఆధ్వర్యాన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల అభివృద్ధిని కాంక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. వాటిని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకుని అభివృద్ధి బాటలో పయనించాలన్నారు. రానున్న కాలంలో విశాఖను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు విశేష కృషి చేస్తున్నారన్నారు. ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ వర్మ, జివిఎంసి కమిషనర్ హరినారాయణన్, వుడా విసి బసంత్‌కుమార్, సూపరింటెండెంట్ ఇంజినీర్ శివప్రసాద్‌రాజు, జెడిసి రమణమూర్తి, ఎఎంహెచ్ఒ మురళీమోహన్, హౌసింగ్ డిఇ గుప్తా, డిఇ మహేష్, ఎపిఇపిడిసిఎల్ డిఇ రాంబాబు, ఎపిడి చిట్టిబాబు, ఇఇ చిరంజీవి, టిడిపి నాయకులు మజ్జి మాలినాయుడు, జోజి, తోట గణేష్, సిఐ కేశవరావు, సర్వసిద్ధి శ్రీలక్ష్మి, కాకి పోలిరెడ్డి, నిమ్మదల శ్రీను పాల్గొన్నారు.

లక్ష్మీనగర్‌లో జన్మభూమి గ్రామసభ

గోపాలపట్నం : జివిఎంసి 68వ వార్డు లక్ష్మీనగర్ నాలుగు కోళాయిల జంక్షన్ వద్ద ప్రభుత్వం చేపట్టిన 'జన్మభూమి - మా ఊరు' గ్రామసభను గురువారం నిర్వహించారు. ప్రభుత్వ అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొని స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ గురించి మాట్లాడారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖ గతేడాది జాతీయ స్థాయిలో మూడో స్థానంలో నిలిచిందన్నారు. ఒకటో స్థానానికి చేరుకోవడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిడిఒ పద్మావతి, జివిఎంసి అధికారులు, తెలుగుదేశం పార్టీ వార్డు అధ్యక్షుడు నారిపిన్ని సత్తిరాజు, జిల్లా మహిళ అధ్యక్షురాలు పిడుగు మంగలక్ష్మి, నగర కార్యదర్శి కెవి బాలసుబ్రహ్మణ్యం, జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ మూర్తి పట్నాయక్, స్థానిక పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

డిసిఐ ప్రయివేటీకరణపై నేడు ప్రజాబ్యాలెట్

మల్కాపురం : డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను ప్రయివేటీకరించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై శుక్రవారం ప్రజాబ్యాలెట్ నిర్వహించనున్నట్లు సిఐటియు మల్కాపురం జోన్ కార్యదర్శి పైడిరాజు తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. ప్రజాబ్యాలెట్‌ను హెచ్‌పిసిఎల్, హెచ్ఎస్ఎల్, డాక్‌యార్డు, దుర్గానగర్, మల్కాపురం ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ఎం జగ్గునాయుడు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

పెందుర్తి

గిరిజన బాలికకు న్యాయం చేయాలి

పెందుర్తి : దువ్వాడ విఎస్ఇజెడ్‌లో గిరిజన మూగ బాలికపై అత్యాచార ఘటనలో బాధితురాలికి న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా నగర ఉపాధ్యక్షురాలు బి అనంతలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. అత్యాచారం చేసిన నిందితునిపై నిర్భయ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలన్నారు. బాధితురాలికి రూ.30 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం

వేపగుంట : ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వాటి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జోనల్ కమిషనర్ చుక్కా సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు జివిఎంసి 69వ వార్డు కృష్ణానగర్‌లో రెండు కొబ్బరిచెట్లు ప్రమాదకరంగా ఉన్నాయనే విషయాన్ని ఆయన దృష్టికి కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు యర్రా నాగరాజు తీసుకొచ్చారు. దీంతో ఆ ప్రాంతంలో గురువారం జెడ్‌సి పర్యటించి ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలగించాలని హార్టికల్చర్ విభాగ అధికారులకు సూచించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



ప్రమాదకర కొబ్బరి చెట్టును పరిశీలిస్తున్న అధికారులు

'498 ఎ'ను యథావిధిగా అమలు చేయాలి




సంతకాల సేకరణలో ఐద్వా నాయకులు

వేపగుంట : మహిళలపై రోజురోజుకూ పెరిగిపోతున్న హింసను కట్టడి చేయకుండా, మహిళలకు రక్షణ కల్పిస్తున్న 498 చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం సవరించాలనుకోవడం దుర్మార్గమని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు బి రమణి, బి అనంతలక్ష్మి అన్నారు. ఈ మేరకు 498 ఎ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలనే నినాదంతో వేపగుంట కూడలిలో గురువారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారిరువురూ మాట్లాడుతూ గృహ హింస, వరకట్న వేధింపులకు గురైన స్త్రీలకు రక్షణ కల్పిస్తూ, అందుకు కారణమైన భర్త, అతని బంధువులపై చట్టం ప్రకారం పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేసేవారన్నారు. అయితే సెక్షన్‌ను మహిళలు దుర్వినియోగ పరుస్తున్నారనే సాకుతో చట్టానికి తూట్లు పొడవడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ సెక్షన్‌ను ఎత్తేస్తే మహిళలపై హింస మరింతగా ప్రజ్వరిల్లుతుందన్నారు. 498 ఎ సెక్షన్‌ను ఎత్తేస్తే ఎదురయ్యే దుష్పరిణామాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నగర నాయకులు డి లావణ్య, జి శ్రీదేవి, ఎస్ వరలక్ష్మి, పి సుబ్బలక్ష్మి, పి విజయలక్ష్మి, సంతు, నాగమణి, పైడమ్మ, సరస్వతి, భారతి తదితరులు పాల్గొన్నారు.

డిసిఐ ప్రయివేటీకరణపై ప్రజాబ్యాలెట్

పెందుర్తి : డిసిఐను ప్రయివేటీకరణపై రైల్వే స్లిపర్ కంపెనీ వద్ద సిఐటియు ఆధ్వర్యాన ప్రజాబ్యాలెట్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు జి అప్పలరాజు మాట్లాడుతూ డిసిఐ ప్రయివేటీకరణపై ప్రజాభిప్రాయాన్ని తెలుసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపుతామన్నారు. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం డిసిఐను ప్రయివేటీకరించాలని కుట్ర పన్నుతోందన్నారు. లాభాల బాటలో పయనిస్తున్న డిసిఐను ప్రయివేటీకరించడంలో ప్రభుత్వ కుట్రను ప్రజలకు తెలియజేసేందుకు వివిధ చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ మాధవరావు, జి శంకరరావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాబ్యాలెట్‌ను నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

సమస్యలపై గణబాబుకు వినతి

ప్రజాశక్తి-మల్కాపురం

గత జన్మభూమిలో ఇళ్ల స్థలాలు, తుపాను బాధితులకు పక్కా ఇళ్ల వంటి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే గణబాబుకు మల్కాపురం సిపిఎం కమిటీ ఆధ్వర్యాన గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం సిపిఎం జోన్ కార్యదర్శి ఆర్ లక్ష్మణమూర్తి మాట్లాడుతూ తుపాను కారణంగా ఇళ్లు కూలిపోయిన బాధితులు ప్రభుత్వం నుంచి సాయం అందకపోవడంతో అప్పులు చేసి నిర్మాణాలు చేపట్టారన్నారు. అలా ఇళ్లు కట్టుకున్న వారికి ఎన్టీఆర్ ఇళ్ల స్కీమ్ కేటాయింపులో తిరస్కారానికి గురవుతున్నారన్నారు. తుపాను బాధితులందరికీ ఎన్టీఆర్ ఇళ్ల స్కీమ్‌ను వర్తింప చేయాలన్నారు. జివిఎంసి 49వ వార్డులో సర్వే నెంబరు 14, 17లలో ప్రభుత్వ భూములు క్రాంతి నగర్, దుర్గానగర్ అల్లూరి సీతారామరాజు కాలనీ, త్రినాథపురం, అచ్చంనాయుడు తోట, ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో వందలాది ఎకరాల ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలన్నారు.

నేడు షిప్‌యార్డు జ్ఞాపికల అందజేత

మల్కాపురం : షిప్‌యార్డు విశ్రాంతి ఉద్యోగులకు రిటైర్‌మెంట్ సందర్భంగా ఇచ్చే మెమొంటోలను శుక్రవారం మధ్యాహ్నం హంసధ్వని ఆడిటోరియంలో అందించనున్నారు. ఈ మేరకు హిందుస్థాన్ షిప్‌యార్డ్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఐఎన్‌టియుసి) గుర్తింపు యూనియన్ సెక్రటరీ గల్లా అప్పారావు గురువారం ప్రకటన విడుదల చేశారు. జులై 2015 నుంచి మే 2017 వరకు రిటైర్ అయిన ఉద్యోగులంతా కార్యక్రమానికి తరలి రావాలని కోరారు.

చంద్రన్న కానుకల పంపిణీ

మల్కాపురం : జివిఎంసి 47వ వార్డు పరిధి ములగాడ హౌసింగ్ బోర్డు కాలనీ 572 రేషన్ డిపోలో చంద్రన్న కానుకలను వార్డు అధ్యక్ష, కార్యదర్శులు వంశీకిషోర్ యాదవ్, రేవల సత్యనారాయణల ఆధ్వర్యాన గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండగ సంతోషాన్ని పేదలకు రెట్టింపు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చంద్రన్న సంక్రాంతి కానుకలను పంపిణీ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పొట్టి మూర్తి, నక్కా లక్ష్మణరావు, పూడి భాస్కరరావు, వి మహేష్, శంకర్, కుంచమ్మ, మంజు, మిటిరెడ్డి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎఇ మణికుమార్, టిడిపి నేతలు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గోపాలపట్నం : జివిఎంసి 42వ వార్డు మర్రిపాలెం వుడా లే అవుట్‌లో రూ.15 లక్షల వ్యయంతో నిర్మాణం కానున్న అభివృద్ధి పనులకు ఎఇ మణికుమార్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో డ్రెయినేజీ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ వార్డు అధ్యక్షుడు కామాకుల నాగేశ్వరరావు, పార్టీ నాయకులు మందలపు వాసుదేవరావు, ఎఎంసి ఉపాధ్యక్షులు పూసపాటి బలభద్రరాజు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

7న వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

దాబాగార్డెన్స్ : ఈ నెల 7వ తేదీన ఆంధ్రా వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆంధ్ర బాడిలిఫ్టింగ్ సంఘం అధ్యక్షుడు ఎస్ శివశంకర్ తెలిపారు. ప్రముఖ బాడీ బిల్డర్ స్వర్గీయ కిలాని అప్పల నారాయణ జ్ఞాపకార్థం ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వీటిని ఉదయం10 గంటలకు స్వర్ణభారతి స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులకు ప్రత్యేకంగా 60 కేజీల లోబడి, రెండు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 8852 03519, 98666 03715 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పెట్టుబడులు ఉపసంహరిస్తే తీవ్ర పోరాటం

సిఐటియు

ప్రజాశక్తి-ఉక్కునగరం
ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారంలో 10శాతం పెట్టుబడులను ఉపసంహరణ ప్రతిపాదనకు ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి విష్ణుదేవ సాయి పార్లమెంట్‌లో వెల్లడించడం దారుణమని స్టీల్ సిఐటియు నాయకులు పేర్కొన్నారు. ఈ ప్రకటను ఖండిస్తూ స్టీల్ సిఐటియు ఆధ్వర్యాన గురువారం పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు జె.అయోధ్యరాం మాట్లాడుతూ, విశాఖ స్టీల్‌ప్లాంట్ యేటా పన్నులు, డివిడెండ్ల రూపంలో రూ.వేల కోట్లు ప్రభుత్వానికి చెల్లిస్తోందని, ఇలాంటి సంస్థలో పెట్టుబడులను ఉపసంహరించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. నష్టాలను సాకుగా చూపి పెట్టుబడులను ఉపసంహరించి సంస్థను ప్రయివేటుకు అప్పగించేందుకే ఈ నిర్ణయమని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి వైటి.దాస్ మాట్లాడుతూ, కర్మాగారానికి ఆర్థిక సాయం చేయాల్సిందిపోయి పెట్టుబడులను ఉపసంహరించడం అత్యంత దుర్మార్గమన్నారు. కేంద్రం ఇదే వైఖరిని అవలంబిస్తే కార్మికవర్గమంతా పెద్ద ఎత్తున పోరాటం చేసి, కేంద్రానికి తగిన రీతిలో బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.సింహాచలం, డిసిహెచ్.వెంకటేశ్వరరావు, యు.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్టీల్ సిఐటియు అధ్యక్షుడు జె.అయోధ్యరాం

'ఎమ్‌టి'ల ఎంపికలో అన్యాయం

ప్రజాశక్తి-ఉక్కునగరం
విశాఖ ఉక్కు కర్మాగారంలో మేనేజ్‌మెంట్ ట్రైయినీ పోస్టుల భర్తీకి సంబంధించి ఇంటర్వ్యూల్ అభ్యర్థుల ఎంపికలో అన్యాయం జరిగిందని ఉక్కు కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. 69 పోస్టుల ఎంపికకు సంబంధించి 137 మంది అర్హత కలిగిన అభ్యర్థులు పరీక్ష రాయగా ఏడుగురిని మాత్రమే ఇంటర్వ్యూకు ఎంపిక చేశారని తెలిపారు. అర్హత పరీక్షకు సంబంధించి కటాఫ్ మార్కులు తగ్గించి అభ్యర్థులకు న్యాయం చేయాలని యాజమాన్యాన్ని కోరారు.

భెల్ కార్మికులకు వేతన ఎరియర్స్ చెల్లించాలని సిఐటియు డిమాండ్

గాజువాక : 1997 వేతన సవరణ ఎరియర్స్‌ను 2017-18 నాటికల్లా చివరి 40 శాతం చెల్లించి ముగించాలని ఎఐఎఫ్ఆర్ తీర్పునిచ్చిందని, ఆ ప్రకారం వెంటనే కార్మికులకు అందించాలని బిహెచ్‌పివి ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) డిమాండ్‌చేసింది. ఈ మేరకు యూనియన్ ప్రచార కార్యదర్శి ఎస్.జగన్నాథరావు, జిటిపి.ప్రకాష్, గండి అప్పారావు, వై.లక్ష్మణ్, ఎస్.అప్పారావు, కె.నారపరెడ్డి, కె.విజయకుమార్ ఒక ప్రకటన విడుదలచేశారు. కార్మికులకు 2017 జనవరిలో చెల్లించేందుకు యాజమాన్యంతో మాట్లాడి సిఐటియు ఏర్పాటుచేసిందని తెలిపారు. సంక్రాంతి పండగ సందర్భంగా కార్మికులు ఎరియర్స్ కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. 21 సంవత్సరాల క్రితం అందాల్సిన ఎరియర్స్‌ను ఇప్పటికీ చెల్లించకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. గుర్తింపు యూనియన్‌గా ఉన్న ఐఎన్‌టియుసి ఈ సొమ్మును కార్మికులకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. యాజమాన్యం స్పందించి సంక్రాంతి ముందుగా ఈ ఎరియర్స్‌ను చెల్లించాలని కోరారు.

చంద్రన్న కానుకల పంపిణీ

కూర్మన్నపాలెం : జివిఎంసి 57వ వార్డు పరిధి దువ్వాడ సెక్టార్-1, 2, నరవ తదితర ప్రాంతాల్లో చంద్రన్న కానుకలను వార్డు టిడిపి అధ్యక్షులు మొల్లి ముత్యాలనాయుడు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదలు సంక్రాంతి పండగను ఆనందంగా గడుపుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువులను కానుకగా అందజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

జూనియర్ ట్రైయినీ పరీక్షను ఆఫ్‌లైన్‌లోనే నిర్వహించాలి

ఉక్కునగరం : విశాఖ ఉక్కు కర్మాగారంలో జూనియర్ ట్రైయినీ పోస్టుల భర్తీకి సంబంధించి పరీక్షలను ఆఫ్‌లైన్‌లోనే నిర్వహించాలని ఉక్కు నిర్వాసితుల సంఘం నాయకులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై చర్చించేందుకు నిర్వాసిత నాయకులు, నిరుద్యోగులు గురువారం స్టీల్‌ప్లాంట్‌లోని నెహ్రూ పార్క్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పరీక్షను ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లోనే నిర్వహించాలని అలా కాని పక్షంలో నిర్వాసిత అభ్యర్థులకు రెండేళ్లు పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చి నేరుగా ఉద్యోగం కల్పించాలని కోరారు. ఈ విషయమై ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నిర్వాసిత నాయకులు బొంతు అప్పారావు, బొడ్డ గోవింద్, రామిరెడ్డి, సంతోష్, బడ్డ వెంకట్రావు, రామ్‌కోటి, అధిక సంఖ్యలో నిర్వాసిత అభ్యర్థులు పాల్గొన్నారు.

జన్మభూమి విజయవంతానికి కృషి

కూర్మన్నపాలెం : జివిఎంసి 58వ వార్డులో ఈ నెల 9వ తేదీన రాజీవ్‌నగర్‌లో నిర్వహించే జన్మభూమి-మావూరు కార్యక్రమం విజయవంతానికి కార్యకర్తలు కృషి చేయాలని వార్డు మాజీ కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వార్డు పార్టీ కార్యాలయంలో గురువారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వార్డు పరిధిలో కొత్తగా 75 పింఛన్లు, 60 రేషన్‌కార్డులు మంజూరయ్యాయని తెలిపారు. వార్డులో పలు సమస్యలపై అర్జీలను తయారుచేసి అధికారులకు తెలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు

పేదల సంక్షేమానికి టిడిపి అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్సీ ఎంవివిఎస్.మూర్తి

ప్రజాశక్తి-గాజువాక
పేదల సంక్షేమానికి టిడిపి అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్సీ ఎంవివిఎస్.మూర్తి అన్నారు. గాజువాక జోనల్ కార్యాలయంలో 60, 61 వార్డులకు సంబంధించి జన్మభూమి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి పేదవాడికి కూడు, గుడ్డ, ఇల్లు కల్పించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నారని చెప్పారు. వైద్యం, విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. గాజువాక ఆటోనగర్‌కు సంబంధించిన ఎపిఐఐసి రైతుల నష్టపరిహారం విషయంలో తమ ప్రభుత్వం న్యాయం చేయడానికి ఇప్పటికే ఒక ప్రణాళిక సిద్ధం చేసిందని చెప్పారు. ఎన్నికల హామీలో భాగంగా గాజువాక హౌస్ కమిటీ సమస్య పరిష్కరించామన్నారు. స్మార్ట్ సిటీలో భాగంగా గాజువాకకు మరిన్ని నిధులు కేటాయించి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, గాజువాక నియోజకవర్గ పరిధిలో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ గృహాలు కేటాయిస్తామని చెప్పారు. ఇప్పటికే సర్దార్ గౌతులచ్చన్న అపార్ట్‌మెంట్ పక్కన 500 యూనిట్లు పూర్తయ్యాయని తెలిపారు. జన్మభూమి అనంతరం దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఆర్.సోమన్నారాయణ, గాజువాక తహశీల్దార్ వేణుగోపాల్, వివిధ విభాగ అధికారులు, టిడిపి నాయకులు, కరణం కనకారావు, పప్పు శంకరరావు, పప్పు రాజారావు, కాళ్ల చిన్న తదితరులు పాల్గొన్నారు.


జన్మభూమిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎంవివిఎస్.మూర్తి

6న ప్రభుత్వ రంగ సంస్థలు-కేంద్రం వైఖరిపై సదస్సు

ప్రజాశక్తి-ఉక్కునగరం
విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ప్రభుత్వ రంగ సంస్థలు-కేంద్ర ప్రభుత్వ వైఖరి' అనే అంశంపై ఈ నెల 6వ తేదీన సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్లాంట్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ తెలిపారు. ఈ సదస్సులో యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ పాల్గొని ప్రసంగిస్తారని, దీనిని ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎల్ఎంఎంఎం పార్కులో యూనియన్ అధ్యక్షుడు జి.బోసుబాబు అధ్యక్షతన గురువారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ, సదస్సులో భాగంగా ప్రభుత్వ రంగ సంస్థల పట్ల కేంద్రం అవలంబిస్తోన్న వైఖరిపై విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. మరో వైపు విశాఖ ఉక్కు కర్మాగారంలో 10 శాతం పెట్టుబడుల ఉపసంహరణ ప్రతిపాదనకు ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి విష్ణుదేవ సాయి పార్లమెంట్‌లో వెల్లడించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. నవ్యాంధ్రప్రదేశ్‌లో అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్ ఇప్పుడిప్పుడే నష్టాల నుంచి బయట పడుతోందని, ఇలాంటి సమయంలో పెట్టుబడుల ఉపసంహరణ నిర్ణయం కర్మాగారం, ఉద్యోగులపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ప్లాంట్ పరిరక్షణకు సంబంధించి అన్ని యూనియన్లతో కలిసి ఐక్యపోరాటం చేయటానికి సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. ఈ సమావేశంలో నాయకులు జి.సోమన్న, ఎ.మసేన్‌రావు, కెఎస్ఎన్.రావు, నరేశ్‌కుమార్, జె.రామకృష్ణ, త్రినాధ్, ఎన్.మిశ్రా, కె.రాజబాబు, బి.అప్పారావు, జయదేవుడు తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పెదగంట్యాడ
పెదగంట్యాడ ప్రాంతంలోని సమస్యలను ఈ జన్మభూమిలోనైనా పరిష్కరించాలని సిపిఎం విజ్ఞప్తి చేసింది. సిపిఎం పెదగంట్యాడ కార్యాలయంలో గురువారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సిహెచ్.రాముడు అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో స్టీల్ ప్రాంతీయ కమిటీ సభ్యులు నమ్మి రమణ మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌లో నిర్వాసితులందరికీ ఉపాధి కల్పించాలని, డౌట్‌ఫుల్, మిస్సింగ్ సమస్యలు పరిష్కరించాలని, స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల నియామకాల్లో ఉక్కు నిర్వాసితులకు సెమీస్కిల్డ్, స్కిల్డ్ పనుల్లో 50 శాతం కోసం ప్రయత్నించాలని, గంగవరం పోర్టులో పెదగంటాడ నిర్వాసితులకు, స్థానికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్‌చేశారు. స్టీల్ ప్రాంతీయ కమిటీ సభ్యులు బి.డిల్లీరావు మాట్లాడుతూ, 2014 ఎన్నికల్లో తెలుగుదేశం ప్రభుత్వం పెదగంట్యాడలో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని నిలబెట్టుకోవాలని కోరారు. గంగవరంపోర్టు కాలుష్య సమస్య, రామచంద్రనగర్ వద్ద ఉన్న చెత్త డంపింగ్‌యార్డు సమస్య, హెచ్‌బి.కాలనీ, నడుపూరు హైస్కూల్ గ్రౌండ్ నిర్మాణ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో జి.శ్రీనివాసరావు, కణితి అప్పలరాజు, దడిశీవంగురుప్ప రమణారెడ్డి, వెంకటరావు, బి.సింహాచలం, బి.ఆనంద్, పాల అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ స్థాపనే ధ్యేయం

ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-గాజువాక
బహిరంగ మల, మూత్ర విసర్జన లేని స్వచ్ఛమైన, సుందరమైన ఆంధ్రప్రదేశ్‌ను స్థాపించడమే ప్రభుత్వ లక్ష్యమని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక చైతన్య డిగ్రీ, పీజీ కళాశాల, జాతీయ సేవా పథకం సంయుక్త ఆధ్వర్యాన జన్మభూమి - మా వూరు కార్యక్రమంలో భాగంగా బహిరంగ మల మూత్ర విసర్జన లేని (ఒడిఎఫ్) స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌పై నిర్వహించిన భారీ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ర్యాలీ పాత గాజువాక కూడలి నుంచి కొత్త గాజువాక సినిమా హాలు జంక్షన్ వరకు వెళ్లి తిరిగి కళాశాలకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బహిరంగ మల మూత్ర విసర్జన వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని, మహిళలు ఆత్మగౌరవానికి భంగం కలుగుతోందని, వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని తెలిపారు. ర్యాలీ ప్రారంభ సమావేశంలో స్థానిక తెలుగుదేశం నాయకులు కాకి గోవిందరెడ్డి, జాతీయ సేవా పథక జిల్లా ప్రోగ్రాం అధికారి ఐపిఎస్ భాగ్యలక్ష్మి, చైతన్య కళాశాల ప్రిన్సిపల్ డా. చంద్రమహాలక్ష్మి , డీన్ ఎంఎల్ నరసింహం, కళాశాల జాతీయ సేవా పథక, ప్రోగ్రాం అధికారులు వైవిఎన్ లక్ష్మీ, రాధ, నివేదిత, అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో జాతీయ సేవా పథక కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు. ర్యాలీ ముగింపు అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు.


మానవహారంగా ఏర్పడిన చైతన్య విద్యార్థులు

డిసిఐపై నేడు ప్రజా బ్యాలెట్

ప్రజాశక్తి-పెదగంట్యాడ
డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ) ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం ఉదయం 8 గంటలకు పెదగంట్యాడ జంక్షన్లో ప్రజా బ్యాలెట్ నిర్వహిస్తున్నట్లు సిఐటియు పెదగంట్యాడ జోన్ ప్రధాన కార్యదర్శి బి.డిల్లీ రావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు, కార్మికులు పెద్ద ఎత్తున హాజరై తమ అభిప్రాయాన్ని తెలయజేయాలని కోరారు.

‘జన్మభూమి’కి వినతుల వెల్లువ



చిట్టివలసలో చెక్కు అందుకుంటున్న మహిళ



మాట్లాడుతున్న మంత్రి గంటా

ప్రజాశక్తి-తగరపువలస

చిట్టివలస లేబర్ వెల్ఫేర్ సెంటర్‌లో గురువారం జరిగిన ఐదో విడత జన్మభూమి – మా ఊరు గ్రామ సభలో పలు సమస్యలపై గురువారం సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. 1 నుంచి 7 వార్డుల పరిధిలోని పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సిపిఎం డివిజన్ నాయకులు ఎస్.అప్పలనాయుడు, రవ్వ నర్సింగరావు, బాబాజీ, సిఐటియు నాయకులు ఎస్.వెంకట్, కానూరి రమణ తదితరులు ఉన్నారు. జెడ్సీ బి.సన్యాసినాయుడు, టిడిపి డివిజన్ అధ్యక్షులు కొప్పల రమేష్, మాజీ కౌన్సిలర్లు చిలకా నర్సింగరావు, కోనూరు రాంబాబు, టిడిపి నాయకులు రవ్వ వెంకటరావు, కొప్పల ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

భీమిలి రూరల్‌లో..

భీమిలి రూరల్ మండలం ఆర్.తాళ్లవలస, జెవి.అగ్రహారం గ్రామాల్లో జన్మభూమి గ్రామసభలు జరిగాయి. ఈ సందర్భంగా లబ్ధిదారులకు మంజూరైన రేషన్ కార్డులు, చంద్రన్న బీమా, ఉపకార వేతనాలు అందజేశారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల సర్పంచిలు దోని వెంకటరమణ, పాసి తాత, టిడిపి మండల అధ్యక్షులు దంతులూరి అప్పల నరసింహరాజు, మాజీ వైస్ ఎంపిపి పాసి నర్సింగరావు, ఎంపిడిఒ కె.హరి ప్రసాద్‌రావు, ఆర్‌డబ్ల్యుఎస్ పంచాయతీరాజ్ డిఇఇ కె.వీరన్న నాయుడు, ఎన్‌ఆర్‌ఇజిఎస్ అధికారి డి.మల్లిఖార్జునరావు, ఎలక్ట్రికల్ ఎఇ ఎస్‌విఎస్.రామ్మూర్తి పాల్గొన్నారు.

పద్మనాభం : సాధికారిక మిత్రలతోనే ప్రతి కుటుంబం అభివృద్ధి చెందుతుందని ఎంపిపి కాళ్ల పద్మ, జెడ్‌పిటిసి కె.దామోధరరావు అన్నారు. మండలంలోని విలాస్‌ఖాన్‌పాలెం, నాతవరం, గంధవరం, కొవ్వాడ గ్రామాల్లో జరిగిన జన్మభూమి కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. 29 మంది వృద్ధులకు తమ గ్రామంలో పింఛన్లు ఇవ్వలేదని కొవ్వాడ మాజీ సర్పంచి మాదిరెడ్డి భాస్కరరావు తెలిపారు. ఈ విషయమై జెడ్‌పిటిసి స్పందిస్తూ రాజకీయాలకు అతీతంగా పింఛన్లు మంజూరు చేస్తామన్నారు. గ్రామాల్లో రంగోళి పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా జన్మభూమి కార్యక్రమాల పర్యవేక్షకులు వైవి.అనురాధ, మండల ప్రత్యేకాధికారి డి.నాగేశ్వరరావు, ఎంపిడిఒ సిహెచ్.నిర్మలాదేవి, తహశీల్దార్ కె.రమాదేవి పాల్గొన్నారు.

సిపిఎస్‌ను రద్దు చేయాలి

అనంతవరంలో జరిగిన కార్యక్రమంలో సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని ఉపాధ్యాయులు కోరారు. ఈ విధానం వల్ల ఉపాధ్యాయ కుటుంబాలు నష్టపోతున్నాయని తెలిపారు.



ఆనందపురంలో రేషన్ కార్డు అందుకుంటున్న మహిళ

ఆనందపురం : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర గిడ్డంగుల శాఖ డైరెక్టర్ బి.మణిశంకర్ నాయుడు అన్నారు. మండలంలోని గిడిజాల గ్రామంలో గురువారం జరిగిన జన్మభూమి గ్రామ సభలో ఆయన మాట్లాడారు. అర్హులందరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రేషన్ కార్డులు, చంద్రన్న బీమా బాండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కోరాడ నాగభూషణరావు, మాజీ చైర్మన్లు కె.వరహాలరాజు, ఎర్ర రాము, ఎంపిపి చెన్నా వరలక్ష్మి, మీసాల సత్యనారాయణ, చెన్నా నర్సింగరావు, సర్పంచ్ కోరాడ రాము పాల్గొన్నారు. పాలవలస, ఎల్‌వి.పాలెం గ్రామాల్లో వినతులు స్వీకరించారు.

టిడిపి బహిరంగ సభలా జన్మభూమి

నాలుగో వార్డు పరిధి పిఎం.పాలెం రెండో బస్‌స్టాప్ వద్దగల రామాలయంలో జరిగిన జన్మభూమి టిడిపి బహిరంగ సభలా సాగింది. జివిఎంసి జోన్ 1 కమిషనర్ పిఎం.సత్యవేణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

వక్తల ప్రసంగాలన్నీ చంద్రబాబు కీర్తనలకే పరిమితమయ్యాయి. కార్యక్రమంలో టిడిపి వార్డు అధ్యక్షులు మన్యాల సోంబాబు, గొల్లంగి ఆనందబాబు, జహనారా, బోయి శ్రీను, కోరాడ రాజబాబు పాల్గొన్నారు. వైసిపి నాయకులు గారె రోసిరెడ్డి, జెఎస్.రెడ్డి, గుమ్మడి మధులు నిరసన తెలిపారు.



పద్మనాభంలో అంగన్‌వాడీ పాఠశాలను పరిశీలిస్తున్న అధికారులు

6న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-భీమునిపట్నం

స్వామి వివేకానంద 155వ జయంతిని పురస్కరించుకుని యువ భారత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ భీమునిపట్నం శాఖ కన్వీనర్ సంకురుభుక్త జోగారావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 9, 10 తరగతుల విద్యార్థులకు జూనియర్ విభాగంగానూ, ఇంటర్ విద్యార్థులకు సీనియర్ విభాగంగానూ వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. ‘స్వామి వివేకానంద బాల్యం – విద్యాభ్యాసం’ అనే అంశంపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం 3 గంటలకు ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఔత్సాహికులైన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని సూచించారు.



కేక్ కట్ చేస్తున్న అంధ విద్యార్థులు

అంధుల పాఠశాలలో బ్రెయిలీ జయంతి

సాగర్‌నగర్ : అంధుల స్ఫూర్తి ప్రదాత బ్రెయిలీ జయంతి వేడుకలను బీచ్ రోడ్డులోని ప్రభుత్వ అంధుల పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. దివీస్ లేబొరేటరీస్ డైరెక్టర్ మధుసూదన్‌రావు మాట్లాడుతూ ప్రతిభకు అంధత్వం అడ్డుకాదన్నారు. బ్రెయిలీ అంధుల జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎం.మహేశ్వరరావు, నూర్జహాన్, ఉపాధ్యాయులు, దివీస్ లేబొరేటరీ అధికారులు ఇఎస్.నాగరాజు, డి.సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఛాత్రోపాధ్యాయులకు బహుమతులు

తగరపువలస : పలు అంశాల్లో ప్రతిభ కనబరిచిన భీమిలి డైట్ ఛాత్రోపాధ్యాయులకు జెడ్‌సి బంటు సన్యాసినాయుడు గురువారం బహుమతులు అందజేశారు. ‘ఆరోగ్యం–ఆనందం’ అంశంలో భాగంగా స్వచ్ఛభారత్, దోమలపై దండయాత్ర కార్యక్రమాలను తెలియజేస్తూ లఘు నాటిక ప్రదర్శించారు. ఒకటో వార్డు బంగ్లామెట్ట సామాజిక భవనం వద్ద గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో డైట్ విద్యార్థులు వి.నాగమణి, డి.మహేశ్వరి, ఎస్.లలితాదేవి, బిఆర్.జానకిలను జెడ్సీ అభినందించారు. పెన్నులు, మిఠాయిలు పంచిపెట్టారు. కార్యమ్రంలో టిడిపి డివిజన్ అధ్యక్షులు కొప్పల రమేష్, పార్టీ నాయకులు రవ్వ వెంకటరావు, కొప్పల కృష్ణారావు పాల్గొన్నారు.



సంతకాల సేకరణ కార్యక్రమంలో ఐద్వా కార్యకర్తలు

మహిళా రక్షణ చట్టానికి సవరణలా ?

సింహాచలం : మహిళా రక్షణ చట్టం 498(ఎ)కు ఎటువంటి సవరణలూ చేయకుండా యథాతథంగా అమలు చేయాలంటూ ఐద్వా ఆధ్వర్యంలో గురువారం 72వ వార్డులో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.రమణి మాట్లాడుతూ ఈ చట్టం వల్ల మహిళలపై జరుగుతున్న వరకట్న వేధింపులు తగ్గాయన్నారు. వారి జీవితాలకు భరోసా లభించిందన్నారు. దీర్ఘకాలిక పోరాటాలతో సాధించుకున్న ఈ చట్టానికి సవరణ చేపడితే చూస్తూ ఊరుకోబోమన్నారు. కార్యక్రమంలో సంఘం గోపాలపట్నం జోన్ నాయకులు విజయలక్ష్మి, పి.సూర్యకాంతం, వినోదిని తదితరులు పాల్గొన్నారు.

72వ వార్డులో సావిత్రిబాయి పూలే జయంతి

ప్రజాశక్తి - సింహాచలం

72వ వార్డు పరిధి ఎస్‌సి కాలనీలో గురువారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఐద్వా గోపాలపట్నం జోన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం కార్యవర్గ సభ్యురాలు విజయలక్ష్మి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు.

అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలు విద్యావంతులు కావాలని సావిత్రిబాయి పూలే ఎంతగానో తపించారన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ముద్దాడ వరప్రసాద్, ఐద్వా నాయకులు పి.సూర్యకాంతం, వినోదిని తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటివేత

మధురవాడ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు గురువారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కామేశ్వరరావు, అధ్యాపకులు సుస్మితాదేవి, తదితరులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలన్నారు.

ఒడిఎఫ్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, నాయకులు

ప్రజాశక్తి-తగరపువలస

బహిరంగ మల విసర్జన వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ గురువారం తగరపువలసలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. చిట్టివలస బంతాట మైదానం వద్ద జోనల్ కమిషనర్ బంటు సన్యాసినాయుడు దీన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని నొక్కిచెప్పారు. ర్యాలీ పట్టణ పురవీధుల గుండా సాగింది. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆర్.రవికుమార్, టిడిపి డివిజన్ అధ్యక్షులు కొప్పల రమేష్, మాజీ కౌన్సిలర్లు చిలకా నర్సింగరావు, కోసూరు రాంబాబు, అర్జి శంకరరావు, టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు రవ్వ వెంకటరావు, తెలుగు యువత నాయకులు కొప్పల కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో భీమిలిలో ఒడిఎఫ్‌పై విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పి.ఉమారాణి, అధ్యాపకులు డి.దుర్గా ప్రసాద్, పివి.నాగేశ్వరరావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

11 మంది విద్యార్థులకు బూట్లు పంపిణీ

ఆనందపురం : ఎన్‌వైసిఎస్ జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీల్లో గెలుపొంది రాష్ట్ర స్థాయికి ఎంపికైన 11 మంది హైస్కూల్ విద్యార్థులకు గురువారం దాతలు షూ పంపిణీ చేశారు. ఆనందపురం గ్రామానికి చెందిన కొట్యాడ సత్యమూర్తి, చందక శివ, ఎర్ర అప్పారావు వీటిని సమకూర్చారు. కార్యక్రమంలో హెచ్ఎం రవీంద్రబాబు, పీడీ మాలతి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కరువే..!

- జెర్రిపోతులపాలెంలో దళిత మహిళపై దాడి
- గిరిజన మూగ బాలికపై అత్యాచారం
- లైంగిక వేధింపుల కేసులో సిఐ సస్పెన్షన్



మహిళలపై దాడులకు నిరసనగా ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాలు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

నగరంలో మహిళలకు రక్షణ కరువైందని ఇటీవల జరుగుతున్న వరుస ఘటనలు రుజువు చేస్తున్నాయి. మొన్న జెర్రిపోతులపాలెంలో ఓ మహిళను వివస్త్రను చేసిన ఘటన సభ్యసమాజం తలదించుకునేలా చేసింది. నిన్నటికి నిన్న విశాఖపట్నం ఎస్ఇజెడ్‌లో ఒక గిరిజన మూగ బాలికను వివస్త్రను చేసి అత్యాచారానికి పాల్పడ్డాడు ఓ కామాంధుడు. మహిళలకు రక్షణ కల్పించాల్సిన పోలీస్ అధికారే ఓ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి సస్పెన్షన్‌కు గురైన సంఘటన బుధవారం వెలుగుచూసింది. దీన్ని బట్టి నగరంలో మహిళలకు రక్షణ లేదని, కామాంధులను రక్షక భటులే కాపాడుతున్నారని అర్థమవుతోంది.

విశాఖ సిటీ పోలీసు కమిషనర్ పరిధిలోని 23 పోలీస్‌స్టేషన్లలో గత సంవత్సరం కూడా భారీ సంఖ్యలోనే అత్యాచారాలు నమోదయ్యాయని పోలీసు రికార్డులే చెబుతున్నాయి. ఈ సంవత్సరం ఆరంభమైన మలి రోజు నుంచే అత్యాచారాలు, అమానుషాలు నమోదవుతూ వస్తున్నాయి. జెర్రిపోతులపాలెంలో ఓ దళిత మహిళను వివస్త్రను చేసిన ఘటన జరిగిన 48 గంటల్లో నిందితులను అరెస్టు చేసిన ఓ నిజాయితీ గల పోలీసు అధికారిని అక్కడి విధుల నుంచి తొలగించి, ఎటువంటి పోస్టింగ్ ఇవ్వకుండా అవమానించిందీ ప్రభుత్వం. ఎస్ఇజెడ్‌లో మూగ గిరిజన బాలికను ఓ కామాంధుడు అత్యాచారం చేశాడు. ఆ ఘనుడు చేసిన నేరం బయటకు రాకుండా బాధిత కుటుంబానికి డబ్బు ఇచ్చి తన నేరాన్ని తుడిచేసుకోవాలని ప్రయత్నించాడు. మీడియా రంగంలోకి దిగడంతో విధిలేక పోలీసులు కేసు నమోదు చేసి, సదరు వ్యక్తిని అరెస్టు చేశారు. ఈ రెండు సంఘటనల సమస్యలు సద్దుమణగక ముందే మూడో పట్టణ సిఐ బెండి వెంకటరావు ఓ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారన్న నేరంపై సస్పెండ్‌కు గురయ్యాడు. ప్రాణం కన్నా శీలం గొప్పదని భావించే మహిళలను వేధిస్తున్న దుర్మార్గుల పట్ల పోలీసుశాఖ ఎందుకు కఠినంగా వ్యవహరించలేకపోతుందోనని పలువురు ప్రశ్నిస్తున్నారు. అత్యాచార నేరాన్ని కోర్టులో పగడ్బందీ సాక్ష్యాలతో నిరూపించి, సదరు నిందితునికి గట్టి శిక్ష పడేట్టు చేస్తే ఇటువంటి నేరాలు తగ్గే అవకాశం ఉంటుంది. కానీ, ఇప్పటివరకూ నమోదైన కేసులలో ఎంత మందికి శిక్ష పడిందని చూస్తే నివ్వెరపోయే సమాధానం కనిపిస్తోంది. పోలీసుల చార్జిషీట్లో డొల్లతనం మగాళ్లను కాపాడుకుంటూ వస్తోంది. అత్యాచార నిందితులను ఏదో విధంగా ఆ నేరం నుంచి తప్పించేందుకు సమాజంలో పలుకుబడి ఉన్న వర్గాలన్నీ కాపుకాయడం వల్ల ఇటువంటి అమానుషాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ప్రశాంతంగా ఉండే విశాఖ నగరంలో నేరాలు ఇంతగా పెరిగిపోవడానికి పోలీస్ అంటే భయం లేకపోవడం, చట్టం అంటే గౌరవం లేకపోవడమే కారణంగా తెలుస్తోంది. పోలీసు అధికారులే తమ వద్దకు న్యాయం చేయాలని వస్తున్న మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడటం శోచనీయం. ఇటీవల ఒక మహిళ విషయంలో రౌడీషీటర్‌ను హత్య చేయించి కటకటలాపాలైన డిఎస్పీ దాసరి రవిబాబు సంఘటన మరువక ముందే త్రీటౌన్ సిఐ బెండి వెంకటరావు తన వద్దకు వచ్చిన మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడి సస్పెండ్‌కు గురవ్వడం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశమైంది.

నిందితులను కఠినంగా శిక్షిస్తాం

- అత్యాచార బాధితురాలిని పరామర్శించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్
- రూ.5 లక్షల ఆర్థిక సహాయం
- ప్రభుత్వ ఉద్యోగానికి ప్రతిపాదిస్తామని హామీ
- ప్రభుత్వం అండగా ఉందని జెర్రిపోతులపాలెం బాధితురాలికి భరోసా



ఫిర్యాదులు స్వీకరిస్తున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ శివాజీ

ప్రజాశక్తి - డాబాగార్డెన్స్

మూగ గిరిజన బాలికపై అత్యాచారానికి పాల్పడ్డ నిందితున్ని కఠినంగా శిక్షిస్తామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ కారెం శివాజీ తెలిపారు. కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న అత్యాచార బాధితురాలిని గురువారం ఆయన పరామర్శించారు. వైద్య సేవలు ఏమేరకు అందుతున్నాయో ఆరా తీశారు. ప్రభుత్వం అండగా ఉందని, ఏ మాత్రం ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దని, ధైర్యంగా ఉండమని భరోసా ఇచ్చారు. తొలి విడతగా రూ.2.50 లక్షల చెక్కును బాధితురానికి అందజేశారు. అంతకుముందు ప్రభుత్వ అతిథి గృహంలో షెడ్యూల్డు కులాలు, తెగలు, ఆయా కుల సంఘాల ప్రతినిధుల నుంచి వినతులు, విజ్ఞాపనలు, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును పరిశీలిస్తూ తక్షణ చర్యలు తీసుకొంటామని ఫిర్యాదుదారులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జెర్రిపోతులపాలెం బాధితులతో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అండగా ఉందని, ఏ మాత్రం భయపడాల్సిన పనిలేదని భరోసా ఇచ్చారు. బాధ్యులైన వారిని కఠినంగా శిక్షిస్తామని అన్నారు.

అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ సమాజంలో వేళ్లనూనుకు పోయిన కుల వివక్షత, అంటరానితనం, అశృస్యతలను నివారించేందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాల్సినవసరం ఎంతో ఉందన్నారు. సమాజంలో అసమానతల నిర్మూలన ఒక్క ఎస్‌సి, ఎస్‌టి. వర్గాల వారితోనే ఇది సాధ్యం కాదని, అన్ని వర్గాల ప్రజలు ముందుకు రావాలని ఆయన కోరారు. జిల్లాలో సుమారు 261 ఫిర్యాదులు పలు స్థాయిల్లో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. కమిషన్ సభ్యులు సివేరి సోమ, ఆర్‌డిఒ వెంకటేశ్వర్లు, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రమణమూర్తి తదితరులతో పాటు రెవెన్యూ, పోలీస్ అధికారులు, ఫిర్యాదుదారులు పెద్ద ఎద్దఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

హోరాహోరీగా సౌత్ జోన్ క్రికెట్ పోటీలు

224 భారీ స్కోర్ చేసిన ఎఎన్‌యు జట్టు

ప్రజాశక్తి- మద్దిలపాలెం

సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ పోటీలు హోరా హోరీగా జరుగుతున్నాయి. గురువారం విశాఖ, విజయనగరంలలోని పలు వేదికల్లో పోటీలు జరిగాయి. ఎనిమిది వేదికల్లో 16 మ్యాచ్‌లు జరిగాయి. ఈ పోటీల్లో గుంటూరు ఎన్‌ఎన్‌యు జట్టు భారీ స్కోర్ నమోదు చేసింది. విజయనగరం మహారాజా కళాశాల మైదానంలో ఎఎన్‌యు, తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన ఎఎన్‌యు జట్టు ముందుగా బ్యాటింగ్ చేసి 5 వికెట్ల నష్టానికి 224 భారీ స్కోర్ చేసింది. అనంతరం బ్యాటింగ్‌కి దిగిన తమిళనాడు జట్టు పేలవమైన ఆటతీరుతో 57 పరుగులకే చేతులెత్తేసింది. ఫలితంగా 167 భారీ తేడాతో ఎఎన్‌యు జట్టు విజయం సాధించింది. జట్టులో సాయి వర్ధన్ 74 బంతులాడి సెంచరీ చేశాడు.

విజయనగరం జెఎన్‌టియు మైదానంలో జరిగిన మ్యాచ్‌లో శాతవాహన, కారుణ్య యూనివర్సిటీలు తలపడ్డాయి. శాతవాహన ముందుగా బ్యాటింగ్ చేసి 25 ఓవర్లలో పది వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కారుణ్య యూనివర్సిటీ జట్టు 23.3 ఓవర్లలో 114 పరుగులకే ఆలవుటైంది. 52 పరుగుల తేడాతో శాతవాహన యూనివర్సిటీ జట్టు విజయం సాధించింది. విజయ నగరం రైల్వే గ్రౌండ్స్‌లో అమృత విశ్వ విద్యాపీఠ్, గాంధీగ్రామ్ యూని వర్శిటీలు తలపడ్డాయి. ముందుగా బ్యాటింగ్ చేసిన అమృత విశ్వ విద్యాపీఠ్ యూనివర్సిటీ ఏడు వికెట్ల నష్టానికి 137 పరుగులు చేసింది. గాంధీగ్రామ్ జట్టు 25 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 119 పరుగులు మాత్రమే చేసింది. ఇందులో అమృత యూనివర్సిటీ జట్టు 18 పరుగుల తేడాతో విజయం సాధించింది. విశాఖ పోర్టు స్టేడియంలో కేరళ ఎంజి, తమిళనాడు విట్ యూనివర్సిటీ జట్లు తలపడ్డాయి. ఎంజి యూనివర్సిటీ జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లు నష్టానికి 190 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన విట్ యూనివర్సిటీ జట్టు 17.5 ఓవర్లలో 74 పరుగులకే ఆల వుటైంది. ఎంజి యూనివర్సిటీ 116 ఆధిక్యంతో విజయం సాధించింది. స్టీల్ ప్లాంట్ క్రిష్ణా గ్రౌండ్స్‌లో కొచ్చి యూనివర్సిటీ, శివమొగ్గ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ యూని వర్శిటీలు తలపడ్డాయి. ముందుగా బ్యాటింగ్ చేసిన కొచ్చి జట్టు 25 ఓవర్లలో పది వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కి దిగిన అగ్రికల్చర్ యూనివర్సిటీ మూడు వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుంది.



విజయనగరం ఎంవిజిఆర్ కళాశాల మైదానంలో ఆదికవి నన్నయ్య, దావంగరే యూనివర్సిటీలు పోటీ పడ్డాయి. దావంగరే జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఆదికవి నన్నయ్య జట్టు 25 ఓవర్లలో 9 వికెట్ల నష్టపోయి 184 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కి దిగిన దావంగరే జట్టు 25 ఓవర్లు ఆడి 9 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసి ఓటమి చవి చూసింది. వైజాగ్ విజ్జీ స్టేడియంలో మంగుళూర్ యూనివర్సిటీ, శ్రీకాకుళం అంబేద్కర్ యూనివర్సిటీలు తలపడ్డాయి. ముందుగా బ్యాటింగ్ చేసిన మంగుళూర్ యూనివర్సిటీ జట్టు 25 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 140 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో అంబేద్కర్ జట్టు కేవలం రెండు పరుగులు వెనుక బడి వెనుదిరిగింది. గీతం మెడికల్ గ్రౌండ్స్‌లో విక్రమ్ సింహపురి, ధార్వాడ్ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్‌లు తలపడ్డాయి. ఇందులో 20 ఓవర్లలో విక్రమ్‌సింహపురి యూనివర్సిటీ జట్టు 6 వికెట్లు నష్టానికి 168 పరుగులు సాధించింది. ధార్వాడ్ యూనివర్సిటీ జట్టు 20 ఓవర్లలో 7 నష్టానికి 115 పరుగులతో వెనుదిరిగింది.

ఫైనల్‌లో ఎస్ఆర్ఎమ్, ఉస్మానియా వర్సిటీ జట్లు

ప్రజాశక్తి- విశాఖపట్నం

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా జరుగుతున్న దక్షిణాది రాష్ట్రాల సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయ మహిళా టెన్నిస్ పోటీల్లో మూడో రోజైన గురువారం ఎస్ఆర్ఎమ్ విశ్వవిద్యాలయం, ఉస్మానియా విశ్వవిద్యాలయం జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నాయని స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి కె.రామకృష్ణారావు తెలిపారు. సెమీఫైనల్‌లో ఎస్ఆర్ఎమ్ విశ్వవిద్యాలయం జట్టు.. బెంగుళూర్ విశ్వవిద్యాలయం జట్టుపై 6-0, 6-1 స్కోరుతో విజయం సాధించగా, ఉస్మానియా విశ్వవిద్యాలయం జట్టు.. ఆన్నా విశ్వవిద్యాలయం జట్టు పై 6-0, 6-0 స్కోరుతో విజయాన్ని నమోదుచేశాయని తెలిపారు. దీంతో ఎస్ఆర్ఎమ్ విశ్వవిద్యాలయం, ఉస్మానియా విశ్వవిద్యాలయం జట్లు ఫైనల్‌లో పోటీపడనున్నాయని తెలిపారు.